ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | 5



నేడు ధవళేశ్వరం జనార్దనస్వామి రథోత్సవం
7

క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలి : ఆలీ



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు



మండపేట భక్తులు సమర్పిస్తున్న కల్యాణ కొబ్బరి బొండాలు

అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది..వేలాది మంది భక్తుల సమక్షంలో ఆ దేవదేవుడి వివాహ మహోత్సవం శోభాయమానంగా సాగింది. సోమవారం అర్ధరాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని పరిణయమాడారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ తంతు వైభవోపేతంగా సాగింది.

వార్తలు 7లో

కల్యాణ వైభోగమే



స్వామివారి కల్యాణ కొబ్బరిబొండాలు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు

రాజమహేంద్రిలో పవన్

నేడు ఉమ్మడి జిల్లా నేతలతో చర్చించే అవకాశం



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోమవారం రాత్రి 8.20 గంటలకు రాజమహేంద్రవరం చేరుకున్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి భారీ కాన్వాయ్‌తో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టన్‌లో బస చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనసేన పోటీ చేసే అసెంబ్లీ సీట్లకు సంబంధించి ఆయా నియోజకవర్గాల జనసేన నాయకులు, ఇతర ముఖ్యులతో పవన్ కల్యాణ్ సోమవారం నుంచి రెండు రోజుల పాటు చర్చించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే రాజమహేంద్రవరం చేరుకునేసరికి రాత్రి కావడంతో నాయకులతో చర్చలు మంగళవారానికి వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. మంగళవారం నాయకులతో చర్చించే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్ బస చేసిన షెల్టన్ హోటల్ వద్దకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో నాయకులు, అభిమానులు తరలిరావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఆయన వెంట ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, జనసేన నాయకులు ఉన్నారు.



అనపర్తిలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి అమానుషమని పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాలు మండిపడ్డాయి.అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ ఫోటోలు తీయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అక్కడ వైసీపీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే.ఈ చర్యను ఖండిస్తూ అనపర్తి,పెరవలి, నిడదవోలు, నల్లజర్ల, తాళ్లపూడి,గోపాలపురం మండలాల్లో జర్నలిస్టులు నిరసన తెలిపి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.కొవ్వూరులో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు దాడిని ఖండించారు.పత్రికా స్వేచ్ఛ హరిస్తే ఊరుకోమని హెచ్చరించారు.దాడికి పాల్పడిన వారిని కఠినంగాశిక్షించాలని డిమాండ్ చేశారు.



మా ఎమ్మెల్యే ఎవరు!

- ఎమ్మెల్యేలుగా మారిపోతున్న ఇన్‌చార్జిలు
- ప్రారంభోత్సవాలు..శంకుస్థాపనలు ..
- పంపకాలు చేసుకుంటున్న నాయకులు
- కొవ్వూరు వనిత ఇలాకాలో తలారి
- తలారి నియోజకవర్గంలో వనిత
- గోరంట్ల నియోజకవర్గాన వేణు
- రాజమహేంద్రవరం సిటీలో ఎంపీ భరత్
- అయోమయానికి గురవుతున్న ఓటర్లు
- ఓటు విలువ లేకుండా చేస్తున్న వైనం
- తూర్పున మారిన రాజకీయం

ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది.. ఓటుకు విలువ లేకుండాపోతోంది. ఒకసారి ప్రజల ఓటుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఐదేళ్ల పాటు అంతా వారిష్టం అనుకుంటున్నారు.. ఎంతలా అంటే చివరికి తమకు ఇష్టం వచ్చిన స్థానాల్లో ఎమ్మెల్యేలుగా చెలామణి అయ్యేటంతగా.. ఇంకా పదవీకాలం ముగియకుండానే తమ స్థానాలను అధిష్ఠానం ఇన్‌చార్జిలుగా నియమించిన వారిని ఇక మీరే చూసు కోండి అని అప్పగించేయడం కొసమెరుపు.అది చూసి ఓటు వేసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మా ఎమ్మెల్యే ఎవరబ్బా అని అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వింత పరిస్థితి చోటుచేసుకుంది.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలిచిన వ్యక్తే ప్రజాప్రతినిధి అవుతారు. ప్రజలు ఓటేసి గెలిపించిన వ్యక్తికి ఐదేళ్ల పాటు అధికార హక్కులు, బాధ్యతలు ఉంటాయి. కానీ ఇటీవల కొత్తధోరణి ప్రబలింది. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు విలువలేకుండా పోయింది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలదే పెత్తనం. ప్రతిపక్షాల తరపున గెలిచిన ఎమ్మెల్యేలకు విలువ ఉండడం లేదు. ప్రస్తుతం ఈ పరిస్థితి మరింత దిగజారింది. వైసీపీ అధిష్ఠానం వచ్చే ఎన్నికల కోసం ఎమ్మెల్యేలను బదిలీ చేసింది.. ఇన్‌చార్జిలుగా నియమించింది. ఎవరైతే వచ్చే ఎన్నికల కోసం ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారో వారే ఎమ్మెల్యేలుగా మారిపోతున్నారు.

అసలు ఎమ్మెల్యే ఎవరబ్బా..

జిల్లాలో ఏడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం ఉండగా, టీడీపీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్ స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే.మిగతా స్థానాలను గత ఎన్నికల్లో వైసీపీ కైవసం చేసుకుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం వల్ల టీడీపీ ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వలేదు. అసలు పట్టించుకోలేదు. సిటీలోనూ, రూరల్‌లోనూ కోఆర్డినేటర్లను పెట్టి, వారి మాటే అధికారులు వినేటట్టు చేశారు. దీంతో ప్రజల నుంచి ఎన్నికకాని వ్యక్తులు అధికారం చలాయించే పరిస్థితి ఏర్పడింది. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ ఎంపీగా జిల్లా మొత్తం అభివృద్ధి చేయాలి. కానీ తన లోక్‌సభ స్థానాన్ని వదిలేసి రాజమహేంద్రవరం సిటీ మీద పట్టుకు ప్రయత్నం చేశారు.అధికారులు ఆయనకే విలువిచ్చారు. సిటీలో టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఉన్నా ఆమెకు కనీసం విలువ ఇవ్వకుండా ప్రభుత్వం, అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. గతంలో కొంతమంది కోఆర్డినేటర్లు ప్రజాప్రతినిధులు కాకపోయినా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం, అధికార ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడంతో ప్రజల ఓట్లతో నెగ్గిన వారికి విలువలేకుండా పోతోంది. పైగా ఇవాళ సిటీలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు కోఆర్డినేటర్లు చెప్పుకుంటున్నారు. ఈ డబ్బు ఎక్కడిది. వైసీపీ ప్రభుత్వం నుంచి ఎంత వచ్చిందంటే సమాధానం లేదు. మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు పన్నులు కట్టడం ద్వారా వచ్చిన జనరల్ ఫండ్‌తో అధికారులు చేయించిన పనులను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి జనరల్ నిధులు, ఫైనాన్స్ నిధులతో చేసిన పనులన్నీ ఇక్కడ ప్రజలతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేయించినట్టే లెక్క. కానీ ఇక్కడ లక్షల మంది ఓటర్లు ఓటు వేసి గెలిచిపించిన నేతలకు విలువ లేకుండా చేస్తున్నారు. రూరల్‌లోనూ అదే పరిస్థితి. టీడీపీ ఎమ్మెల్యేగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయనను కాదని వైసీపీ ముగ్గురు కోఆర్డినేటర్లను మార్చి వారికి పెత్తనం ఇచ్చి ఎమ్మెల్యే ప్రమేయం ఏమీ లేదన్నట్టు వ్యవహరించింది. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణును అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం ఓటర్లు నెగ్గిస్తే ఎమ్మెల్యే అయ్యారు. కానీ వైసీపీ అధినేత జగన్ ఆయనను వచ్చే ఎన్నికల్లో పోటీ నిమిత్తం రాజమహేంద్రవరం రూర ల్ కోఆర్డినేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి వేణు తనను ఓటేసి గెలిపించిన ప్రజలను అక్కడే వదిలేసి రాజమహేంద్రవరం రూరల్‌లో పెత్తనం చేస్తున్నారు. రూరల్‌లో ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విలువ లేకుండా చేస్తున్నారు. ప్రోటో కాల్ పాటించడంలేదు. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి.ఇదే పరిస్థితి కొవ్వూరు, గోపాలపురంలలో కూడా నెలకొంది. కొవ్వూరు నుంచి ఎన్నికై మంత్రిగా ఉన్న రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను గోపాలపురం కోఆర్డినేటర్‌గా నియమించి,అక్కడ ఎమ్మెల్యేను కొవ్వూరు కోఆర్డినేటర్ నియమించిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి వనిత తనను గెలిపించిన కొవ్వూరు ప్రజలను వదిలేసి గోపాలపురం వెళ్లిపోయారు. అక్కడ ప్రజలు గెలిపించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అక్కడి ప్రజలను వదిలేసి కొవ్వూరు వచ్చారు. అమె అక్కడ, ఆయన ఇక్కడ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. అసలు చట్టరీత్యా ఇది చెల్లుతుందా ఇక్కడ వీరు ప్రజాప్రతిని ధులు ఎలా అవుతారు.

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం.. అపహాస్యం



గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత



కొవ్వూరులో శనివారం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి

ఓటుకు విలువేది

అంతా ఇష్టారాజ్యం..

అధికారం ఉంది కదా అనీ వైసీపీ అధిష్ఠానం చెప్పినట్టు అధికారులు నడచుకోవడం ప్రజా స్వామ్యమేనా? ఇక ఓటేసి గెలిపించిన ప్రజాప్రతినిధులకు విలువేముంది.వారు గెలిపించిన ప్రజాప్రతినిధికి విలువేముంది. కోఆర్డినేటర్ల వ్యవస్థతో ఎన్నికైన వారిని హక్కులను హరించడం నేరమవుతుంది. ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటే, ఓటరు ఎవరికి ఓటు వేయాలో కూడా నిర్ణయించుకోలేని పరిస్థితి వస్తుంది. ఎన్నడూ లేనిది నియోజకవర్గ ఇన్‌చార్జిలే ఎమ్మెల్యేలుగా చలామణి అయిపోతున్నారు. తమ ఇష్టం వచ్చినట్టు స్థానాలే మార్చేసుకుంటున్నారు. మరో దారుణమైన సంగతేంటంటే జగ్గంపేట ఎమ్మెలే జ్యోతుల చంటిబాబును ఎన్నికలషెడ్యూల్ కూడా ప్రకటించకుండానే పక్కన పెట్టేశారు. తోట నరసింహంను కోఆర్డినేటర్‌గా నియమించడంతో అధికారులంతా ఆయన మాటే వింటున్నారు.ఎమ్మెల్యే డమ్మీ అయ్యారు.గోకవరం మండలంలో ఆయన తిరగడం మానేశారు. ఆయన మాట వినేవారు లేరు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో, ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైనట్టయ్యింది.

స్పందనలో 167 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ , ఫిబ్రవరి 19: ప్రజల నుంచి వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత, జిల్లా ఎస్పీ పి.జగదీశ్ జిల్లా అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖతో కలిపి మొత్తం 167 అర్జీలు వచ్చాయని చెప్పారు. రెవెన్యూ శాఖకు 60, పోలీస్ శాఖకు 32, పంచాయతీ రాజ్‌కు 20, పురపాలక శాఖకు 15 అర్జీలు వచ్చాయన్నారు. సహాయ కలెక్టర్లు సి.యశ్వంత్ కుమార్, అదనపు ఎస్పీ అనీల్, డీఆర్వో జి నరసింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి, కెఆర్ ఆర్సీ ఎస్డీటీ కృష్ణనాయక్ లు ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు.

ఎన్నికలకు 16 బృందాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు 16 బృందాలను నియమించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల్లో విధుల్లో సుమారు 11 వేల మంది అధికారులు,సిబ్బంది పాల్గొంటారన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు అధికారులకు, సిబ్బందికి ఎటువంటి సెలవులకు అనుమతివ్వడం జరగదని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి ఇప్పటికే అధికారులు వారికి సంబంధించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 : ఓపీఎస్‌ను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు సోమవారం జనసేన, టీడీపీ నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యాచరణలో భాగంగా జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలిసి విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అన్ని రాజకీయపార్టీలు పాత పెన్షన్ విధానం అమలు చేసేలా తమ మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. పార్టీ అధినేతల దృష్టికి ఓపీఎస్ అంశం తీసుకెళతామని దుర్గేష్, బుచ్చయ్యచౌదరి తమతో చెప్పారన్నారు.

గప్‌చుప్!



- యథేచ్ఛగా సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్
- ఒక్కసారిగా ఆగిన తవ్వకాలు
- నేడు తనిఖీలకు ఎన్‌జీటీ రాక కారణం
- డ్రెడ్జింగ్ నిలిపివేయాలని ఆదేశం..
- సోమవారం రాత్రే గోదారంతా ఖాళీ
- అంతా సవ్యమేనని హైకోర్టుకు ఎస్పీ నివేదిక
- ఇసుక అక్రమార్కుల మాయాజాలం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో ఇసుక అక్రమార్కుల మాయాజాలానికి అంతులేకుండా పోయింది. జిల్లాలో సుమారు 25 ఓపెన్ ర్యాంపులు, సుమారు 40కు పైగా బోట్స్‌మన్ ర్యాంపుల ద్వారా గోదావరిలో రాత్రీపగలూ వందలాది డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తవ్వేస్తున్న సంగతి తెలిసిందే.ఈ డ్రెడ్జింగ్ దృశ్యాలు రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంత ప్రజలతో పాటు గోదావరి బ్రిడ్జిలపై రాకపోకలు సాగించేవారందరికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. కానీ అధికారులకు మాత్రం కనిపించడంలేదు. ఇసుక అక్రమాలపై నివేదిక ఇవ్వాలని సంక్రాంతి ముందు హైకోర్టు జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే.అయితే ఆయన కొద్దిరోజుల కిందట హైకోర్టుకు సమర్పించిన నివేదికలో అక్కడ అంతా సవ్యంగానే జరుగుతుంది, అక్రమంగా డ్రెడ్జింగ్ ఏమీ జరగడంలేదని, పలువురి బోట్స్‌మన్ సొసైటీలు, అధికారుల అభిప్రాయాలతో పాటు ,చివరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి కూడా ప్రస్తుతం ఏమీ జరగనున్నట్టు తెలిపినట్టు నివేదిక ఇవ్వడం గమనార్హం. కానీ ఇవాళ కూడా డ్రెడ్జింగ్ ఆగలేదు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలను స్వయంగా చూడడానికి ఎన్‌జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ప్రతినిధులు మంగళవారం రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై సోమవారం రాత్రి నుంచే డ్రెడ్జింగ్ నిలిపివేయాలని ఆదేశించారు. మంగళవారం ఎక్కడా డ్రెడ్జింగ్ బోట్లుకానీ,యంత్రాలు కానీ కనిపించకూడదని ర్యాంపు నిర్వాహకులకు సూచించారు.దీంతో మంగళవారం నాటికి గోదావరిలో డ్రెడ్జింగ్ బోట్లు,ఇతర యంత్రాలు కనిపించ కుండా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ పరిస్థితిని బట్టే ఇక్కడ ఇసుక అక్రమాలు జరుగుతున్నాయో లేదో అర్థంచేసుకోవచ్చు. గత మే నెలలో జేపీ సంస్థ కాంట్రాక్టు ముగిసిన సంగతి తెలిసిందే. కానీ రెండు నెలల కిందట వరకూ అదే సంస్థ పేరుతో రూ.కోట్ల విలువైన ఇసుక లాగేశారు. రాజమహేంద్రవరం వైపు ఆర్‌కే అనే ఒక వ్యక్తి నెలకు పెద్దలకు రూ.12 కోట్లు ఇచ్చే విధంగా ఒప్పందం పెట్టుకుని ర్యాంపు నిర్వాహకులకు టన్నుకు రూ. 150 నుంచి రూ. 200 ఇస్తూ డ్రెడ్జింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే.దీనిపై ఆరోపణలు రావడంతో పాటు ఒకరు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం కంగారు పడింది.

పక్కా ప్లాన్ ప్రకారం..

హైకోర్టు ఇక్కడి అక్రమాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీని ఆదేశించడంతో ఇసుక వ్యాపారులు తప్పించుకోవ డానికి పక్కా ప్లాన్ వేశారు. దానికి గతంలో ఇసుక మేటలు డ్రెడ్జింగ్ కోసం సుమారు రూ.270 కోట్లతో ఒప్పందం పెట్టుకున్న రాఘవా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని రక్షణకవచంగా ఉపయోగించునే ఎత్తుగడ వేసినట్టు సమాచారం. వాస్తవానికి రెండేళ్ల కిందటే ఈ సంస్థ డ్రెడ్జింగ్ కాంట్రాక్టును దక్కించుకుంది. అయితే సదరు కాంట్రాక్టు సంస్థ సుమారు రెండు నెలల కిందట వరకూ డ్రెడ్జింగ్ మొదలు పెట్టలేదు. కానీ ఇతరులు అనధికారిగా డ్రెడ్జింగ్ నిర్వహించారు.ఇవాళ హైకోర్టు ఆదేశంతో ఇక్కడ డ్రెడ్జింగ్ అనధికారికంగా ఏమీ జరగలేదని చెప్పడానికి గతంలో కాంట్రాక్టు పొందిన సంస్థకు వెంటనే రంగంలోకి దింపినట్టు సమాచారం. ప్రస్తుతం డ్రెడ్జింగ్ అంతా అదే సంస్థ అధికారికంగా చేస్తుందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితి చూస్తే వేరేగా ఉంది.

డ్రెడ్జింగ్ అంటే ఇదా?

గోదావరిలో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించి, నీటి నిల్వను పెంచేటట్టు చేయాలి. పెద్ద డ్రెడ్జర్‌ను తెచ్చి నదిలో దింపి డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గొట్టాల ద్వారా గోదావరి ఒడ్డున ఇరిగేషన్ స్థలాల్లో పోగు చేయాలి. దానిని అధికారుల అనుమతితో మార్కెట్‌లో విక్రయించి ఆ సొమ్ము ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. గతంలో తెలుగుదేశం హయాంలో పిచ్చుకలంక పూడ్చడానికి మేటల డ్రెడ్జింగ్ ఇసు క ఉపయోగించారు. మేటల నుంచి పిచ్చులంకలోకి గొట్టాలు వేసి నేరుగా ఇసుకను పంపించారు. కానీ భారీ డ్రెడ్జర్లు లేవు. పెద్ద బోట్లకే లారీ ఇంజన్లు బిగించి డ్రెడ్జింగ్ చేస్తున్నారు. కేవలం రూ. 500 ఖర్చుతో సుమారు 40 నుంచి క్యూబిక్ మీటర్ల ఇసుకను ఒక సారిగానే తోడేస్తున్నారు. దీంతో ఖర్చు తక్కువ. లాభం ఎక్కువ.అందుకే అక్రమార్కులు ఈ మార్గం ఎంచుకున్నారు. పైగా ఇటీవల ప్రతిమా అనే సంస్థకు ఇసుక తీతను ప్రభుత్వం కాంట్రాక్టుకు ఇచ్చింది.ఆ సంస్థ లేబుల్‌తోనే బిల్లులు ఇస్తున్నారు. మరి ప్రస్తుతం ప్రతిమా సంస్థ డ్రెడ్జింగ్ చేస్తుందా? రాఘవా కంపెనీ చేస్తుందా అనేది ఇక్కడ ఎవరికీ అర్థం కాని విషయం.కానీ డ్రెడ్జింగ్ మాత్రం జరిగిపోతుంది.

అంతా సవ్యంగానే ఉందని ఎస్పీ నివేదిక

ఇసుక అక్రమాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో ఎస్పీ పి.జగదీష్ ఇటీవల హైకోర్టుకు నివేదిక ఇచ్చారు. కానీ అందులో ఎక్కడా యంత్రాలతో పనిచేయడంలేదని, మాన్యువల్‌గా చేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీ మాత్రమే ఒప్పందం ప్రకారం డ్రెడ్జింగ్ చేస్తున్నట్టు అధికారుల వివరణతో ఆయన నివేదిక ఇవ్వడం గమనార్హం. పైగా హైకోర్టుకు ఫిర్యాదు చేసిన వ్యక్తి కూడా ఇక్కడ అక్రమంగా డ్రెడ్జింగ్ జరగలేదని చెప్పినట్టు ఈ నివేదికలో ఉండడం గమనార్హం.వాస్తవానికి కచ్చులూరు బోట్ ప్రమాదం తర్వాత ఇక్కడ ఇసుక బోట్లకు లైసెన్సులు ఇవ్వలేదు.కానీ ఇక్కడ సాధారణ బోట్లతో పాటు డ్రెడ్జింగ్ బోట్లు కూడా తిరుగుతున్నాయి. వీటికి ఎవరు అనుమతిచ్చారు. ఇప్పటి వరకూ ఎంత ఇసుక తవ్వారు.గతంలో అక్రమాలు జరిగి ఉంటే ఎంత మేర జరిగి ఉంటాయనే దాని జోలికి ఎవరూ వెళ్లలేదు.

మరి భయమెందుకు

ఇక్కడ అక్రమాలు లేకపోతే, ఎన్జీటీ బృందం వస్తుందని తెలియగానే తేలుకుట్టిన దొంగలా వ్యవహరించడం దేనికి? మంగళవారం డ్రెడ్జింగ్ మిషన్లు,యంత్రాలను దాచేయమని ర్యాంపుల నిర్వాహకులకు ఆదేశాలివ్వడంలేదనికి..?దీనిని బట్టే ఇక్కడ ఎంత అక్రమాలు జరుగుతున్నాయో అర్థమ వుతోంది.

ఇన్‌స్టాగ్రామ్ వివాదం..
వివాహిత కిడ్నాప్

- కారులో ఎత్తుకెళ్లిన మహిళలు
- అరగంటలోనే పట్టుకున్న పోలీసులు

గోకవరం, ఫిబ్రవరి 19 : ఇన్‌స్టాగ్రామ్‌లో ఏర్పడిన వివాదం కారణంగా ఒక వివాహితను ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి పోలీసులకు చిక్కారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని చిట్టీలవారివీధికి చెందిన వీరమళ్ళ సునీతను కొవ్వూరుకు చెందిన ఇద్దరు మహిళలు, గోకవరానికి చెందిన మరో మహిళ కిడ్నాప్ చేసేందుకు సోమవారం మధ్యాహ్నం పన్నాగం పన్నారు. పథకం ప్రకారం ఐ ట్వంటీ కారులో సునీత ఇంటి వద్ద ముందుగా గస్తీ నిర్వహించారు.ఆ సమయంలో సునీత ఇంటి వద్ద లేకపోవడంతో ఆమె ఇంటికి వచ్చే వరకు అక్కడే కారులో కాపుకాచారు.ఇదిలా ఉండగా సునీత సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయట నుంచి ఇంటికి రావడాన్ని సదరు ముగ్గురు మహిళలు గుర్తించారు. వెంటనే కారు నుంచి ఆ ముగ్గురు మహిళలు సునీత ఇంటికెళ్లి ఆమెను బలవంతంగా ఈడ్చుకుంటూ కారులోకి ఎక్కించి అక్కడ నుంచి పరారయ్యారు.అడ్డొచ్చిన కుటుంబీకులను పక్కకు గెం టేశారు.దీంతో బాధిత కుటుంబీకులు షాక్‌కు గురయ్యారు. కొంత సేపటికి తేరుకున్న సునీత భర్త దేవీ వరప్రసాద్ హుటాహుటిన వెళ్లి ఎస్ఐ నాగరాజుకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు తన సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేశారు. వివాహిత సునీతను కిడ్నాప్ చేసి తీసుకెళుతున్న నిందితుల కారు కోసం రెండు రూట్లలో అన్వేషణ ఆరంభించారు. చివరకు గోకవరం నుంచి తంటికొండ వెళ్లే రోడ్డులో కారును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌కు యత్నించిన ముగ్గురు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కారును స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్‌కు గురైన సునీతను బంధువులకు అప్పగించారు. బాధితులు మధ్యాహ్నం 3 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేయగా 3.30 గంటలకే కేసును చేధించారు. దీంతో బాధిత కుటుంబీకులు ఊపిరిపీల్చుకున్నారు.

పంట బోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్
క్లీనర్ మృతి

7

వైభవంగా నారసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- కల్యాణం తంతు నిర్వహించిన వేద పండితులు
- పట్టువస్త్రాలు సమర్పించిన శృంగేరి, పాలమూరు వారు
- కనులారా వీక్షించిన భక్తజన సందోహం

అంతర్వేది, ఫిబ్రవరి 19: నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రోచ్చారణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలను కల్యాణమాడారు. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రివారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతోచూసి తరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం సోమవారం దశమి రాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు వైభవంగా జరిగింది. వైష్ణవ సాంప్రదాయబద్ధంగా వేద పండితులు, అర్చక స్వాములు కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయఅర్చకులు ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆశీనులై స్వామివారి కల్యాణం వీక్షించారు. ఉభయ రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. సుమా రు నాలుగు గంటల పాటు సాగిన స్వామివారి కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఉచిత దర్శనం కోసం ఎదురు చూశారు.



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎదురు సన్నాహంతో శ్రీకారం

రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరిజిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహకర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు, అధికారులు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు, అమ్మవార్లకు అంతర్వేదికరకు చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. కల్యాణం నిర్వహణలో ఆనవాయితీ ప్రకారం పేరూరు వేద పండితులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పొలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు.

స్వామి, అమ్మవార్లకు మధుపర్కాలు..

కల్యాణానికి ముందు దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మొగల్తూరు రాజావారు ఆలయ ఫౌండర్ రాజాకలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఎస్పీ ఎస్.శ్రీధర్, ఆలయ అధికారులు, భక్తులు శ్రీ స్వామి, అమ్మవార్లకు మధు పర్కాలు సమర్పించారు.

అద్భుతంగా విద్యుత్ అలంకరణలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి గ్రామ పురవీధుల ముఖద్వారాలను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. స్వామివారి కల్యాణ మండపాన్ని, ఆలయాన్ని అద్భుతంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. అయోధ్య బాలరాముడు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వివిధ సెట్టింగ్‌లతో ఆలయ పుణ్య క్షేత్రమంతా అలంకరించారు.



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు



స్వామి కల్యాణానికి హాజరైన ఎస్పీ శ్రీధర్ దంపతులు




గ్రామోత్సవం



పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై నిర్వహిస్తున్న స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి సత్యనారాయణమూర్తి, నరసింహస్వామివారిచే నిర్మితమైన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారు గ్రామోత్సవం జరగ్గా భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. రాత్రి 7గంటలకు అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులచే నిర్మితమైన కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపానికి తీసుకునివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, పి.వెంకటకృష్ణ, మూలాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారంరాత్రి జరిగిన స్వామివారి కల్యాణం, అనంతరం మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.00 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సోమవారం రాత్రికే రథంవద్ద అరటిపండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు ఇచ్చారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు. శ్రీ స్వామివారి రథోత్సవం రాజావారి వీధి నుంచి ఆచార సాంప్రదాయాల లాంఛనాలతో సోదరి గుర్రాలక్కమ్మ అశ్వరూఢాంబిక ఆలయం వద్దకు చేరుకుని చీర, సారెలతో సోదరికి అందజేసి తిరుగు ప్రయాణంలో స్వామివారి రథం 16స్తంభాల మండపం వద్దకు చేరుకుంటుంది.



రద్దీగా మారిన అన్నవరం సత్యదేవుడి ఆలయ ప్రాంగణం

భీష్మ ఏకాదశి సందర్భంగా ..

సత్యదేవుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వసతి గదులు సరిపడక భక్తుల అవస్థలు

అన్నవరం, ఫిబ్రవరి 19: సత్యదేవుడి సన్నిధి మంగళవారంరోజున భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి దర్శనానికి సోమవారం రాత్రికే తరలిరావడంతో ఆలయప్రాంగణం పోటెత్తింది. సత్రంగదులు సరిపడకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయప్రాంగణంలో సేద తీరారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారంరాత్రి 11గంటల నుంచి వ్రతం టిక్కెట్లను విక్రయించి ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఈవో రామచంద్రమోహన్ సర్క్యులర్ జారీ చేశారు. భక్తులకు క్యూలైన్‌లో ఎటువంటి అవస్థలు పడకుండా త్రాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే రద్దీ నియంత్రణకు అంత్రాలయ ప్రదక్షణ, యంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదలచేసి లఘు దర్శనానికి పరిమితం చేయాలని ఆలయవిభాగ సిబ్బందికి సూచించారు. నిరంతరాయంగా పులిహోర వితరణ చేపట్టాలని సూచించారు.

స్వామివారికి బంగారు ఆభరణాల అలంకరణ



కల్యాణోత్సవాల్లో స్వామివారికి అలంకరించే ఆభరణాలు



అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిది సంవత్సరాల నుంచి స్వామివారి పూర్వ నగలను బ్యాంకులో ఉంచి ప్రస్తుతం కొత్త ఆభరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ సమయంలో స్వామివారి కుందనపు కిరీటం ధరిస్తారు. వక్షస్థలం, శంఖుచక్రాలు, అనేక బంగారు ఆభరణాలు ధరించే స్వామివారిని దర్శించుకోవడంవల్ల జన్మజన్మల పుణ్యఫలం వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆభరణాలన్నీ వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు వంటివి పూర్వకాలంలో మహారాజులు సమర్పించారని చెబుతారు. పూర్వపు ఆభరణాలు శిథిలావస్థకు చేరుకోవడంవల్ల బ్యాంకుల్లో భద్రపరిచారు. అంతర్వేదికర గ్రా మంలో ఉన్న అంతర్వేదికి చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులచే ఉత్సవమూర్తులకు మాత్రం సాదా ఆభరణాలు తయారుచేయించి వార్షికంగా ఉత్సవాలకు అలంకరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు మిరియాల గాంధీ దంపతులు స్వామివారికి బంగారు శఠగోపాన్ని, పూణె వాస్తవ్యులు వేంకటేశ్వరా హేచరీసంస్థ నిర్వాహకులు స్వామివారికి బంగారు పంచపాత్రలు, ఉద్దరిణీలు, బిందె, పళ్లెం, బంగారు ఆభరణాలు సమర్పించారు.

పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేత

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన వార్షిక దివ్య తిరు కల్యాణానికి పొలమూరు, శ్రీశృంగేరి జగద్గురు భారతీతీర్థ మహాస్వామి, విధుశేఖరభారతిస్వామివార్లు తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందించారు. గుడిమెల్లంక శ్రీవిద్యాభారతి శంకరపీఠం తరుపున దేవదాయశాఖ, ఆలయ అధికారులకు, పండితులకు అందించినట్టు తెలిపారు.

నేడు ధవళేశ్వరం జనార్దన స్వామి రథోత్సవం



ఉభయ దేవేరులతో జనార్దన స్వామి, రథోత్సవం (ఫైల్)



ధవళేశ్వరం, ఫిబ్రవరి 19: పురాణ ప్రసిద్ధి గాంచి జనార్దనగిరిపై ఉన్న లక్ష్మీ జనార్దనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించడానికి అధి కారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ పరిసరాలను చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ వినయ్ మోహన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించనున్నారు. రాత్రికి కొండపై స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్ ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో 20 పడకల ఆసుపత్రి నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట ఆదర్శనగర్‌లో డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల, డాక్టర్ రేఖ పోతూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. న్యూరాలజి ,మెదడు, జనరల్ వైద్యవిభాగం గైనకాలజి సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జనరల్ సర్జన్ తాతిన రాంబ్రహ్మం, డాక్టర్ పొత్తూరి చౌడప్ప , జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కాకినాడకు చెందిన సైక్రియాట్రిస్ట్ డాక్టర్ మల్లికార్జునరావు, పిడియాట్రిక్స్ డాక్టర్ పాకలపాటి రవికిరణ్, ప్రముఖ న్యూరాలజిస్ట్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్లు ఎస్ఎస్ రామరాజు, డాక్టర్ కర్రి రామారెడ్డి, నిమ్మలపూడిగోవిందు, డాక్టర్ పి.రవికిరణ్ పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో

సత్యదేవ నర్సరీకి స్థానం



తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్ పత్రాలు చూపుతున్నచంటి, పెదసత్యనారాయణ

కడియం, ఫిబ్రవరి 19: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అయోధ్య రామమందిరం, బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కడియపులంక పుల్లా చంటియ్యసత్యదేవా నర్సరీలో మొక్కలతో రామమందిరం, రాముని ప్రతిరూపం, అయోధ్య ఆలయం, దేశప్రధాని మోదీ ప్రతిరూపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కింది. తమకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కడం సంతోషంగా ఉందని చంటియ్య ఆయన కుమారుడు పెదసత్యనారాయణ అన్నారు.

వేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడు మృతి



కరప, ఫిబ్రవరి 19: సముద్రంలోకి వేటకెళ్లిన మత్స్యకారుడు బోటులోనే గుండెపోటుతో మరణించిన ఘటన కాకినాడజిల్లా కరప మండలం ఉప్పలంకలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలంక గ్రామానికి చెందిన పెసంగి వెంకటేశులు(52)సోమవారం తెల్లవారుజామున సహచర మత్స్యకారులతో కల్సి సముద్రంలోకి వేటకు వెళ్లాడు. వేట సమయంలో గుండెలో నొప్పి ఉందని వెంకటేశులు చెప్పడంతో వెంటనే సహచరులు బోటును ఒడ్డుకు చేర్చేందుకు వేగంగా వస్తుండగా మార్గమధ్యలో బోటులోనే మరణించాడు. మృతు నికి భార్య చంద్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షులు బొమ్మిడి సతీష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశులు మృతి చెందడం వారికుటుంబీకులు దిక్కులేని వారయ్యారని బాధితుల పరిస్థితిని ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి సాయమందించాలని కోరారు.

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి

- సినీ హాస్యనటుడు ఆలీ



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఆలీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19: క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ప్రముఖ సినీ హాస్య నటుడు ఆలీ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆర్‌పీఎల్ (రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్) సీజన్-6 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి అలరించారు. జాతీయస్థాయిలో రాణించిన ఎందరో క్రీడాకారులు చిన్న చిన్న టోర్నమెంట్లలో ఆడినవారే ఉన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ 2031 నాటికి ఇక్కడి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, టోర్నమెంట్ నిర్వాహకులు అజ్జరపు వాసు, కుంచే శేఖర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 19: డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గునపంతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. కాకినాడ అర్బన్ గొడారిగుంట సీతారామ్‌నగర్‌కు చెందిన తల్లిబోయిన వెంకన్న బావమరిది కఠారిశ్రీను ఇంటి పక్కన నివాసం ఉండేవారు. 2020, సెప్టెంబరు 29న డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గొల్లపల్లి దుర్గాలు, కొండ వెంకటేష్, గొల్లపల్లి రమణ, కొండ మణికంఠ మధ్య తలెత్తిన వివాదంతో వీరంతా కలసి తల్లిబోయిన వెంకన్నపై గునపంతో, రాళ్లతో దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఈ సంఘటనపై కాకినాడ సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎన్.సతీష్‌బాబు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులను సోమవారం కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన తర్వాత నిందితులపై నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న గొల్లపల్లి దుర్గాలుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఏ2 కొండ వెంకటేష్, ఏ3 గొల్లపల్లి రమణ, ఏ4 కొండ మణికంఠలకు తలో రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ కె.రాధాకృష్ణరాజు వాదించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్

- ఒకరి మృతి.. ఇద్దరికి స్వల్పగాయాలు



మృతుడు చైతన్‌దాడియ

దేవరపల్లి, ఫిబ్రవరి 19: జీవనోపాధి కోసం వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి చెంది కుటుంబానికి విషాదం మిగిల్చిన ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం జాతీయ రహదారివద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సోమవారం భీమవరం నుంచి విశాఖపట్నం డెకరేషన్ సామగ్రితో వెళ్తున్న వ్యాన్ దేవరపల్లి మండలం కృష్ణంపాలెం సమీపంలో సర్వీసు రహదారిలో పంటబోదెలోకి దూసుకెళ్లి సిమెంటు దిమ్మను ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్‌లో ముగ్గురు ప్రయాణిస్తుండగా ఒరిస్సాకు చెందిన వ్యాన్ క్లీనర్ చైతన్ దాలియ(54) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా దాలియ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు ఇటీవల జీవనోపాధి నిమిత్తం కుమారుడితో కలిసి విశాఖపట్నం వచ్చాడని, ఈనెల 17న భీమవరంలోని ఒక ఫంక్షన్‌కు డెకరేషన్‌చేసి ఆదివారం తెల్లవారుజామున తిరిగి సామగ్రితో వెళ్తుండగా డ్రైవర్ నిద్రమత్తువల్ల ప్రమాదం జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

ఉప్పుటేరులో ఈతకు వెళ్లి విశాఖ యువకుడి మృతి



మృతిచెందిన షేక్ మౌలాలీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: ఉప్పుటేరులో స్నేహితులతో ఈతకు వెళ్లిన విశాఖకు చెందిన యువకుడు మృతి చెందినట్టు కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మౌలాలి(22) ఆదివారం కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగిన బంగారుపాప ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో స్నేహితులతో కలిసి స్థానికంగా రామన్నపాలెం, మూలపేట మధ్య ఉన్న ఉప్పుటేరులో ఈతకు వెళ్లాడు. ఒడ్డుకు చేరే ప్రయత్నంలో ఉప్పుటేరు ఉధృతికి మౌలాలి నీటమునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. అతడి స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మౌలాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సందేశాన్ని ఇస్తూ...ఆలోచింపజేసిన నాటికలు

తాటిపర్తిలో ముగిసిన ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు



స్వర్గానికి వంతెన నాటిక సన్నివేశం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 19: సమాజంలో జరుగుతున్న విషయాలు, సంఘటనలకు అద్దం పడుతూ అదే సమయంలో అందరినీ ఆలోచింపచేస్తూ, సందేశాన్ని ఇస్తూ సాగాయి నాటికలు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో భాగంగా చివరిరోజు ప్రదర్శించిన నాటికలు అన్నింటికీ డబ్బే ప్రదానం కాదని, చేసిన మంచి పని ఎల్లప్పుడూ గుర్తు ఉంటుందని తెలియజేశారు.

- మనిషికి మరణం అనివార్యం. జీవితకాలంలో మంచి పనులు చేస్తే అవి ఎల్లప్పుడు గుర్తు ఉంటాయి అని చాటి చెప్పింది స్వర్గానికి వంతెన నాటిక. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా, గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు.
- డబ్బు కోసం ఆడిన పెళ్లి నాటకం బయటపడటం, అదే అదనుగా న్యాయవాది ఆ మహిళను వివాహం చేసుకోవాలనుకోవడం, చివరికి అన్ని విషయాలు బయటకు వచ్చి తప్పుడు మార్గంలో పయనించాలనుకున్న వారికి బుద్ధి చెప్పడాన్ని పక్కింటి మొగుడులో ప్రదర్శించారు. కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోవిందరాజు నాగేశ్వరరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం నాటిక

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల ప్రదర్శనలో గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన అమృతహస్తం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన బంధం నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎన్.రవీంద్రరెడ్డి(ఇంద్రప్రస్థం), ఉత్తమ రచనగా సత్యనారాయణ(అమృతహస్తం), ఉత్తమ నటుడిగా గోపరాజు విజయ్(కౌలస్య సుప్రజ రామ), ఉత్తమ నటిగా రత్నకుమారి(బంధం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఏపూరి హరిబాబు(అమృతహస్తం)లు ఎంపిక కాగా జ్యూరీ అవార్డులకు పిఠాపురం బాబూరావు, టి.శ్రీలేఖ, సురభిలతలు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా రాజా తాతయ్య, గారపాటి శ్రీనివాస్‌లు వ్యవహరించగా, మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి తదితరులు విజేతలకు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేత

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

శంఖవరం, ఫిబ్రవరి 19: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు సోమవారం కాకినాడజిల్లా కత్తిపూడి పాత చెక్‌పోస్టు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. విశాఖ నుంచి భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అన్నవరం ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... డ్రైవర్‌కి బీపీ తక్కువకావడంతో ఇబ్బంది పడుతుండగా అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. పదిమంది స్వల్పంగా గాయపడగా ప్రాథమిక వైద్యం అందించి వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

ఇవేం రోడ్డు పనులు?

- గుత్తేదారుల లాభం కోసమే గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ పనులు
- తాడేపల్లి నుంచి రంప బీటీ రోడ్డులో నాణ్యతా లోపాలు


తాడేపల్లి-రంప మధ్య సాగుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులు

రంపచోడవరం, ఫిబ్రవరి 19: కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ నిధులతో మన్యంలో ఇంజనీరింగ్ శాఖలు నిర్మిస్తున్న తారు రోడ్ల కార్పెట్లను తలపిస్తున్నాయి. గుత్తేదారుల ప్రయోజనమే లక్ష్యంగా ఇక్కడ ఇంజనీర్లు పనిచేస్తున్నారు. మారుమూల ప్రాంతాలలో సాగే ఇటువంటి రోడ్డు నిర్మాణాలు కేవలం ఇంజనీర్లు-గుత్తేదార్ల కుమ్మక్కు వ్యవహారాలకు రంపచోడవరం ఐటీడీఏకు అనుబంధంగా నడుస్తున్న గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం అల్లూరిజిల్లా మారేడుమిల్లి మండలం తాడేపల్లి నుంచి రంపచోడవరం మండలం రంప వరకూ చేపట్టిన సుమారు 14 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం ఇందుకు అద్దం పడుతోంది. ఈ పనిని పొందిన అనధికార గుత్తేదారు తన లాభాపేక్షే లక్ష్యంగా నాణ్యతను విస్మరించి ఇష్టారాజ్యంగా రోడ్డును నిర్మించుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.4.32 కోట్లతో ఈ తారు రోడ్డు పని మంజూరైంది. స్థానిక గిరిజనులకు ఉపాధిని కల్పించే లక్ష్యమే కాకుండా మౌలిక సదుపాయాలను కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. కాగా ఈ పనిలో గుత్తేదారుకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఇంజనీరింగ్ అధికారులు వ్యవహరించడం శోచనీయం. రంపచోడవరం మండలం రంప నుంచి తాడేపల్లి వరకూ ఈ రహదారి వందలాది గ్రామాలను కలిపే ముఖ్యమైన రహదారి. ఈ పనిలో అనేక ప్రాంతాలు రక్షిత అటవీ ప్రాంతంలో ఉండటంతో కొన్ని దశాబ్దాలుగా ఈ పనికి అటవీశాఖ నుంచి ఆటంకం కలిగింది. ఇటీవల కాలంలో కొన్ని మినహాయింపులతో ఈ రోడ్డు నిర్మాణం పునఃప్రారంభమైంది. ఇది గిరిజనుల సౌకర్యార్థం కాకుండా రోజుల వ్యవధిలోనే పాడైపోయి ఇప్పుడున్న పరిస్థితి కంటే మరింత అసౌకర్యాన్ని కల్పించేలా పరిణమించింది. జిల్లా కలెక్టరు చైర్మన్‌గానూ, జాయింట్ కలెక్టరు స్థాయి అధికారి సారథ్యంలో నడిచే ఐటీడీఏకు అనుబంధంగా గిరిజన సంక్షేమ ఇంజనీర్లు, ఇతర శాఖల ఇంజనీర్లు గిరిజనాభివృద్ధి స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు. గతంలోనే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ డివిజన్‌స్థాయి అధికారిపై చర్యలు చేపట్టినా ఈ శాఖాధికారులలో ఎటువంటి మార్పూ రాలేదు. ఈ తారురోడ్డు విషయంలో ఐటీడీఏ ఉన్నతాధికార్లు ఎలా స్పందిస్తారో చూడాలి

'అరాచక పాలనకు నిదర్శనం మీడియాపై దాడి'

ఎటపాక, ఫిబ్రవరి 19: రాప్తాడు సిద్ధం సభలో రాష్ట్రంలో అరాచకపాలనకు నిదర్శనంగా వైసీపీ మూకలు మీడియాపై దాడిచేశాయని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు తెలిపారు. సోమవారం ఆయన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ సిద్ధం సభకు కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ను గుర్తించి, మూకుమ్మడిగా కర్రలతో దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పాత్రికేయులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై కూడా వైసీపీ ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, వైసీపీ అరాచక, దౌర్జన్యాలతో మరలా అధికారం కోసం దాడులు చేస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో మీడియాపై ఇటు వంటి దాడులు జరగకుండా దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



రంపచోడవరం, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసునని అన్నారు. బూటకపు ప్రసంగాలు ఆపి దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలన్నారు. రాష్ట్రంలో ఏ మూల చూసిన అభివృద్ధి లేదని, ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం కనిపిస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి సబ్సిడీలను నిలిపివేసిన జగన్‌కు రాయలసీమలో సభ పెట్టే అర్హత లేదన్నారు.

జనసేనలో పలువురి చేరిక


జనసేనలో చేరిన వైసీపీ కుటుంబాలు

చింతూరు, ఫిబ్రవరి 19 : లచ్చిగూడెం, వెంకటాపురం గ్రామాలకు చెందిన 48 కుటుంబాలు సోమవారం జనసేనపార్టీలో చేరినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మడివిరాజు తెలిపారు. వారందరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైందని, దీంతో జనసేనలోకి వలసల పర్వం మొదలైందని ఆయన అన్నా రు. యువత జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికలలో విజయం సాధించే విధంగా అడుగువేయాలని ఆయన పేర్కొన్నారు. నాయుకులు తీగల కవిత, కారందుర్గారావు, నాగార్జున, కొవ్వాసి బాబూ రావు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, ఫిబ్రవరి 19: 2024-25 విద్యాసంవత్సరానికిగాను రంపచోడవరం, చింతూరు డివిజన్లలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు, ఎస్టీలకు 55, ఎస్సీలు 10, బీసీ 4, ఓసీ 2, ఏఈక్యూ 2, పీహెచ్‌సీ 2, పీటీజీ 5 సీట్లు ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల్లో బ్యాగ్‌లాగ్ సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతిలో 12, ఏడో తరగతిలో 8, ఎనిమిదో తరగతిలో 5, 9వ తరగతిలో 11 చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, కూన వరం, రంపచోడవరం గురుకుల పాఠశాలల్లో ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ లేదా సంబంధిత గురుకుల పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి: పీవో

రంపచోడవరం, ఫిబ్రవరి 19: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. సోమవారం ఆయన ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల గ్రామాలు, వ్యక్తిగతానికి సంబంధించిన దరఖాస్తులు 49 అందాయన్నారు. కోట గ్రామంలో ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు త్రీఫేస్ విద్యుత్ అందించాలని, కుండాడ-కడుమూరు- తూరుమామిడి గ్రామాలకు మెటల్‌రోడ్డు ఏర్పాటు చేయా లని, ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. డీడీలు అబుసలాం, షరీఫ్, ఎస్డీసీ డీఎస్ శాస్త్రీ, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, డీఎల్‌పీవో రాఘవన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

చింతూరు, ఫిబ్రవరి 19 : చింతూరు మండలం, మామిళ్లగూడెంలో 2019 జులై 11న బాలికపై అత్యాచారం, హత్య ఘటనలు చోటుచేసుకున్నాయని కాగా ఆ కుటుంబానికి ఇప్పటివరకు ప్రభుత్వం ఎటువంటి సహాయం అందజేయకపోవడం విడ్డూరమని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు ముర్రం రంగమ్మలు పేర్కొన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. తక్షణమే బాధిత కుటుంబానికి రూ.20లక్షల పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జయరాములమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వినియోగదారుల పరిష్కార వేదిక

చింతూరు, ఫిబ్రవరి 19 : వినియోగదారుల పరిష్కార వేదికను ఈనెల 21న చింతూరులో నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ కె.మలాకి సోమవారం తెలిపారు. వినియోగదారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేదికవద్ద తమ సమస్యలను తెలియపర్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఫోరం చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతనజరుగుతుందన్నారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కడియం, ఫిబ్రవరి 19: మండలంలోని దుళ్లలో వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభయ్యాయి. భక్తులు గోవిందమాలధారణ చేశారు. సోమవారం విశ్వక్సేనపూజ, దీక్షాధారణ, అకల్మషహోమం, మేదినీపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, శేషవాహన సేవ జరిగాయి. 20న స్వామివారి కల్యాణం, గరుడవాహన సేవ, 21న సుదర్శనహోమం, సింహవాహనసేవ 22న అన్నకూటోత్సవం, సదస్యం, హనుమత్‌వాహనసేవ 23న అమ్మవార్లకు అభిషేకం, లక్ష్మీహోమం, సామూహిక కుంకుమార్చన, హంసవాహనసేవ, 24న పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్పయాగం జరుగుతాయని ఆలయార్చకులు, కమిటీ తెలిపింది.

జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధం


రంగంపేట: ఈలకొలనులో టీడీపీలో చేరిన వారితో రామకృష్ణారెడ్డి

▸▸ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.. టీడీపీలో పలువురి చేరిక

రంగంపేట, ఫిబ్రవరి 19: సీఎం జగన్ రాష్ట్రంలో పలు జిల్లాల్లో సిద్ధం.. సిద్ధం అని సభలు పెడుతున్నాడని, ఫ్యాన్ రెక్కలను విరిచి జగన్‌ను ఇంటికి పంపించడానికి ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈలకొలను గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వెలుగుబంటి సూరిబాబు, నల్లమిల్లి వీరబాబు, తానింకి ఏసు, కురుకూరి అప్పారావు, బత్తిన త్రినాథ్‌స్వామితోపాటు 20 కుటుంబాలు చేరాయి. వారికి రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నికి వాయువు తోడైనట్లు చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ తోడై రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించే దిశగా అందరూ పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, సిరసపల్లి నాగేశ్వరరావు, పోతుల వెంకటరావు, ఉద్దండ్రావు శ్రీను, పూసల శ్రీను, సాయిబాబు పాల్గొన్నారు.

ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం: నెహ్రూ

గోకవరం, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వైసీపీకి చెందిన 100 కుటుంబాలు సోమవారం నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఓటుతో సీఎం జగన్ కుర్చీని మడత పెట్టేయాలన్నారు. ప్రజాదరణ కోల్పోవడంతో అరాచకం, అక్రమాలు, రౌడీయిజంతో రాబోయే ఎన్నికలకు జగన్ సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని మరోమారు దోచుకోవడానికే జగన్ సిద్ధ పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రంగంపేట: ఈలకొలనులో టీడీపీలో చేరిన వారితో రామకృష్ణారెడ్డి

టీడీపీ జనసేన కూటమితోనే సంక్షేమ పాలన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమితోనే సంక్షేమపాలన సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 49వ డివిజన్‌లో టీడీపీ నాయకులు దుత్తరపు గంగాధర్ , నేమాలి శ్రీను ఆధ్వర్యంలో సోమవారం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల ఇబ్బందులు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులపై అక్రమ కేసులు అన్యాయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంపీపీ సత్యప్రసాద్

కడియం, ఫిబ్రవరి 19: వేమగిరి జగనన్న లే-అవుట్‌లో సుమారు 827 మందికి పట్టాలు చూపి ఇళ్లస్థలాలు ఇవ్వకుండా అధికారులు నాలుగున్నరేళ్లగా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, ఇప్పుడు కొత్తగా వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. కడియంలో సోమవారం టీడీపీ కార్యాలయం వద్ద ప్రసాద్ మాట్లాడుతూ వేమగిరి జగనన్న లేఅవుట్‌లో 20 ఎకరాల జిల్లా పరిషత్ భూమిని లేఅవుట్‌గా కేటాయించారన్నారు. లబ్దిదారులను గుర్తించి నాలుగేళ్ల కిందటే పట్టాలు మంజూరు చేశారన్నారు. పట్టాలున్న పేదలకు స్థలాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఈనెల 17న లేఅవుట్ వద్దకు రమ్మంటూ లబ్ధిదారులను పిలిచారని, అక్కడకు చేరుకున్న మహిళలకు స్థలాలు చూపి డబ్బులు వసూలు చేశారని ప్రసాద్ అన్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారని, అధికారులు హామీతో విరమించారన్నారు. ఇదిలా ఉండగా పలువురు మహిళలపై కేసులు పెట్టడం దారుణమన్నారు. ఫోను చేసి లేఅవుట్‌కు పిలిచి సర్వే చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అమాయకులపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, గుత్తుల కృష్ణ, వరగోగుల సత్యనారాయణ, జల్లి కృపారావు, శీలం రవి, వై.హరిప్రసాద్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వెలుగుబంటి ప్రసాద్

నాడు వైఎస్‌కన్నారు.. నేడు శివాజీకిచ్చారు..!

▸▸ నందం గనిరాజు సెంటర్ పార్కులో చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: రాజమహేంద్రవరం నందం గని రాజు సెంటర్‌లోని పార్కులో చత్రపతి శివాజీ మహరాజ్ సంఘ్ వారిచే శివాజీ విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు.ఈ మేరకు ఎంపీ మార్గాని భరత్ రామ్ హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.నగర యావత్ హిందూ సమాజం కోరిక మేరకు ప్రభుత్వ నుంచి అనుమతులు తీసుకొని శివా.ఈ జయంతి సందర్భంగా హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహరాజ్ సంఘ్ వారికి ఈ ప్రాంగణాన్ని అప్పగించామన్నారు. అతి సుందరంగా ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని సంఘ సభ్యులను కోరారు.ఈ కార్యక్రమంలో సంఘ్ అధ్యక్షుడు కాంతారావు పాటిల్ , ఉపాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, కార్యదర్శి వైష్ణవ దినేష్, సహకార్యదర్శి సంజయ్ రౌథల్, కోశాధికారి జటారామ్ చౌదరి పాల్గొన్నారు.

నాడు వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానించిన స్థలమిదే..

రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్ కార్నర్‌లో ఉన్న ట్రైయాంగిల్ పార్కులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 2010 ఏప్రిల్ 17న అప్పటి 7వ వార్డు కాంగ్రెస్ కార్పొరేటర్ గూడూరి రాధిక (వైసీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సతీమణి) కోరారు. ఈ మేరకు తన ప్రతిపాదన అప్పటి మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ పెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు తీర్మానించింది. అయితే అప్పటి కౌన్సిల్ తీర్మానం ఏ విధంగా ఎంపీ భరత్ రామ్ రద్దు చేయించారు. వైఎస్ఆర్ విగ్రహం పెట్టాల్సిన చోట చత్రపతి శివాజీ విగ్రహాన్ని పెట్టాలని ఎలా నిర్ణయం తీసుకున్నారో అర్థం కాని పరిస్థితి. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

ఘనంగా శివాజీ జయంతి

రంగంపేట, ఫిబ్రవరి 19: బాల్యం నుంచి ధైర్య సాహసాలు అలవర్చుకోవడంలో శివాజీ జీవిత ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు షెలవరపు సాయిరాం అన్నారు. సోమవారం రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల జరిగిన శివాజీ జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీలను గౌరవించడం, మాతృభావన, దేశాభిమానం పెంపొందించుకోవడంలో కృషి చేయాలన్నారు. శివాజీ జీవిత విశేషాలను హెచ్ఎం వి.పార్థసారధి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.హేమ మాట్లాడారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మండవల్లి గుప్త, వై.నాగేంద్ర, ఎం.ప్రసాద్, శ్రీనివాస్, పలువురు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై మరింత నిఘా

కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాను మాదకద్రవ్యాల వినియోగ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమ వారం కలెక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్ అధ్యక్షతన జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ ఫర్ బెటర్ కోఆర్డినేషన్ ఇన్ కంట్రోలింగ్ గంజా/అదర్ డ్రగ్స్(ఎన్‌కార్డ్) సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో మరింత నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యా ల నియంత్రణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లు, అడిషనల్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీలు సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అమ్మకాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ జగదీశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, జిల్లా ఫారెస్ట్ అధికారి బి.నాగరాజు, డీఎస్పీలు అంబికా ప్రసాద్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు కలెక్టర్ అభినందన



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19: జాతీయ 67వ స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన అక్కా చెల్లెళ్లు కారంగి తరంగిణి, కారంగి హేమశ్రీ పతకాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. పాట్నాలో ఫిబ్రవరి 13 నుంచి 16వరకూ జాతీయ స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న కారంగి హేమ శ్రీ 49 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించగా, టెన్త్ చదువుతున్న కారంగి తరంగిణి 55 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జాతీయ క్రీడల విజేతలు తరంగిణి, హేమశ్రీలను కలెక్టర్ అభినందించారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధి చాప కింద నీరులా ప్రవహించి యువతులు ప్రాణాపాయానికి గురవుతున్నారని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ జ్యోతి అన్నారు. స్థానిక వీజే ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, మానవ పాపిల్లోమా వైరస్, ఋతుచక్రం మార్పులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని సాయి బ్లోసమ్స్ మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ క్యాన్సర్ రకాలను వివరించి, చికిత్స ద్వారా వ్యాధి తీవ్రతను కొంతవరకూ తగ్గించుకోవచ్చన్నారు. వ్యాక్సినేషన్, స్త్రీ వ్యక్తిగత శుభ్రత ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎన్‌వీవీజగన్మోహనరెడ్డి, చైర్‌పర్సన్ శకుంతల, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో పీవీ కిషోర్ పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జాకబ్

ఆర్థిక కమిటీ సభ్యుడిగా ఈశ్వరరెడ్డి



రంగంపేట/బిక్కవోలు, ఫిబ్రవరి 19: ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగంపేట హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వి.క్రిస్టియన్ జాకబ్ ఎన్నికయ్యారు. భీమవరంలో ఆదివారం రాత్రి జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్‌లో జాకబ్‌తోపాటు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడిగా బిక్కవోలు మండలం ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తమలంపూడి ఈశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేడీజే డేనియల్ బాబు, ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఎస్టీయూ నాయకులు త్రినాథ్, భామిరెడ్డి, పోలిరామారెడ్డి తదితరులు అభినందించారు.

నృసింహస్వామి నిజరూప దర్శనం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 19: వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం సోమవారం కన్నుల పండువగా సాగింది. కోరుకొండరోడ్డు సింహాచలనగర్ శ్రీ వరాహలక్ష్మి నృసింహస్వామి క్షేత్రంలో శ్రీ మధు భయ వేదానాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.దీనిలో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి నిజరూప దర్శనమిచ్చారు. నగర ప్రముఖులు, వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం శ్రీవారి చక్రస్నానం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు తెలిపారు.

బాలికలకు దుస్తులు వితరణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రరి 19: దానవాయిపేట బాలసదనం బాలికల వసతి గృహంలో బాలికలకు సోమవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగి ఉంగరాల ప్రభాకర్ నూతన దుస్తులు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి బళ్లాశ్రీనివాసరావు , నిర్మలకుమార్,సదనం సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్ అందజేత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 : జిల్లాలో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇప్పటి వరకూ రూ.5.25 లక్షల విలువ చేసే 16 ల్యాప్‌టాప్‌లు అందజేయడం జరిగిందని కలెక్టర్ కె.మాధవీలత వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. అల్పాదాయ వర్గాలకు చెందిన తల్లిదండ్రులు లేదా సంరక్షులకు చెందిన పోస్టుగ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లకు హాజరయ్యే విద్యార్థులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్‌వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లిటిల్ స్టార్స్ అండ్ షీ ఆసుపత్రి ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో డాక్టర్ రమేష్ గంటా

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 19: రాజమహేంద్రవరంలో అత్యాధునిక వైద్యసదుపాయాలతో లిటిల్ స్టార్స్ అండ్‌షీ ఆసుపత్రిని ప్రారంభించామని ఆసుపత్రి సీఈవో డాక్టర్ రమేష్ గంటా తెలిపారు. ఆసుపత్రిని సోమవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. డెలివరీ సమయంలో హైరిస్క్ ఉన్న కేసులకు తమ ఆసుపత్రిలో సమర్థవంతంగా సేవలందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జీఎస్ఎల్‌చైర్మన్ డాక్టర్ గన్నిభాస్కరరావు, డాక్టర్ గంటా రూప, డాక్టర్ శ్రీనయ, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ శ్రీహర్ష, జాగృతి అధినేత డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్పందనకు 28 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 28 అర్జీలు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత ప్రకాష్ నగర్ కు చెందిన జి.లక్ష్మి తనకు చేయూత పథకం మంజూరు చేయాలని, ఇళ్ళ స్థలం ఇప్పించాలని అర్జీపెట్టుకుంది. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పి.వెంకటేశ్వరరావు మంచినీటి కుళాయి కనెక్షన్, మునిసిపల్ కాలనీలో రెండు ,మూడు వీధుల్లో 30 అడుగుల రోడ్డు మరమ్మతు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వంగలపూడి వలంటీర్ తొలగింపునకు చర్యలు

సీతానగరం, ఫిబ్రవరి 19: మండలంలోని వంగలపూడిలో ఓ వితంతువు అకౌంట్ నుంచి ఆమెకు తెలియకుండా సొమ్ములు డ్రా చేసిన గ్రామ వలంటీర్ కోడెల్లి చినరామును విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎంపీడీవో కృష్ణప్రసాద్ సోమవారం తెలిపారు. వలంటీర్ చేసిన పనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శిని స్టేట్‌మెంట్ కోరామని, అది రాగానే వలంటీర్‌ను విధుల నుంచి తప్పిస్తామన్నారు. కాగా సొమ్ములు డ్రాచేసిన కేసులో పరోక్షంగా వంగలపూడి సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ పాత్రవుందని అతనికి షోకాజ్ నోటీస్ జారీచేసి అతని నుంచి వివరణ తీసుకున్న తరువాత నిర్ణయం తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు.

తణుకులో తిరుమల స్కూల్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో తిరుమల సంస్థల చైర్మన్ తిరుమలరావు

తణుకు, ఫిబ్రవరి 19: తిరుమల విద్యాసంస్థలు రాజమహేంద్రవరం వారి నూతన శాఖను సోమవారం తణుకు మెయిన్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌ను తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తిరుమల విద్యాసంస్థలు రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట ఉన్నాయని, ప్రస్తుతం తణుకులోని ఇరగవరం రోడ్డులో కొమరవరం వద్ద మరో క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.హరి, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

గోకవరం, ఫిబ్రవరి 19: వ్యవసాయరంగానికి రోజులో 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని, లైన్‌మెన్‌లను వెంటనే నియమించాలని కోరుతూ సోమవారం గోకవరం విద్యుత్‌శాఖ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. మండలంలోని రంపయర్రంపాలెం, గంగంపాలెం, పెంటపల్లి, కామరాజుపేట, కొత్తపల్లి గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాల్లో విద్యుత్ మోటార్లపై ఆధారపడి మొక్కజొన్న, వరి పంటను సాగు చేస్తున్నామని, కానీ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయన్నారు. రోజులో 9 గంటల పాటు విద్యుత్ సరఫరా జరిగితేనే గాని తమ పంటలు చేతికందవన్నారు. ప్రస్తుతం 7 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తుండడంతో పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదన్నారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించాలంటూ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా స్పందన కనిపించకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు ఆందోళనకారుల వద్దకు చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం, రంపయర్రంపాలెం, పెంటపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

ధవళేశ్వరం, ఫిబ్రవరి 19: ధవళేశ్వరంలో బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ రాజగోపుర, శిఖర ప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో నిర్మించిన రాజగోపురానికి, శిఖరాలకు గ్రామ సభాపతి మంగళంపల్లి చంద్రశేఖర్‌శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ మేళా

బిక్కవోలు, ఫిబ్రవరి 19: బలభద్రపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్, సాప్, టీటీసీ సహకారంతో సోమవారం డిజిటల్ మేళాను ఏర్పాటు చేశారు. మేళాను సర్పంచ్, ఉప సర్పంచ్ బుంగా రామారావు, నల్లమిల్లి వెంకటరెడ్డి ప్రారంభించారు. మేళాలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పీబీ వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ వైశాలి పాల్గొన్నారు.



నేడు ధవళేశ్వరం జనార్దనస్వామి రథోత్సవం 8

మార్చి మొదటి వారంలోనే ఎన్నికల నోటిఫికేషన్

కల్యాణ వైభోగమే



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు



మండపేట భక్తులు సమర్పిస్తున్న కల్యాణ కొబ్బరి బొండాలు

అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది..వేలాది మంది భక్తుల సమక్షంలో ఆ దేవదేవుడి వివాహ మహోత్సవం శోభాయమానంగా సాగింది. సోమవారం అర్ధరాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని పరిణయమాడారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ తంతు వైభవోపేతంగా సాగింది.

వార్తలు 7లో



స్వామివారి కల్యాణ కొబ్బరిబొండాలు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు

రాజమహేంద్రిలో పవన్

నేడు ఉమ్మడి జిల్లా నేతలతో చర్చించే అవకాశం



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోమవారం రాత్రి 8.20 గంటలకు రాజమహేంద్రవరం చేరుకున్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి భారీ కాన్వాయ్‌తో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టన్‌లో బస చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనసేన పోటీ చేసే అసెంబ్లీ సీట్లకు సంబంధించి ఆయా నియోజకవర్గాల జనసేన నాయకులు, ఇతర ముఖ్యులతో పవన్ కల్యాణ్ సోమవారం నుంచి రెండు రోజుల పాటు చర్చించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే రాజమహేంద్రవరం చేరుకునేసరికి రాత్రి కావడంతో నాయకులతో చర్చలు మంగళవారానికి వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. మంగళవారం నాయకులతో చర్చించే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్ బస చేసిన షెల్టన్ హోటల్ వద్దకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో నాయకులు, అభిమానులు తరలిరావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఆయన వెంట ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, జనసేన నాయకులు ఉన్నారు.



నిడదవోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టుల నినాదాలు

జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి అమానుషమని పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాలు మండిపడ్డాయి.అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ ఫోటోలు తీయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అక్కడ వైసీపీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే.ఈ చర్యను ఖండిస్తూ అనపర్తి,పెరవలి, నిడదవోలు, నల్లజర్ల, తాళ్లపూడి,గోపాలపురం మండలాల్లో జర్నలిస్టులు నిరసన తెలిపి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.కొవ్వూరులో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు దాడిని ఖండించారు.పత్రికా స్వేచ్ఛ హరిస్తే ఊరుకోమని హెచ్చరించారు.దాడికి పాల్పడిన వారిని కఠినంగాశిక్షించాలని డిమాండ్ చేశారు.

మా ఎమ్మెల్యే ఎవరు!



- ఎమ్మెల్యేలుగా మారిపోతున్న ఇన్‌చార్జిలు
- ప్రారంభోత్సవాలు..శంకుస్థాపనలు ..
- పంపకాలు చేసుకుంటున్న నాయకులు
- కొవ్వూరు వనిత ఇలాకాలో తలారి
- తలారి నియోజకవర్గంలో వనిత
- గోరంట్ల నియోజకవర్గాన వేణు
- రాజమహేంద్రవరం సిటీలో ఎంపీ భరత్
- అయోమయానికి గురవుతున్న ఓటర్లు
- ఓటు విలువ లేకుండా చేస్తున్న వైనం
- తూర్పున మారిన రాజకీయం

ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది.. ఓటుకు విలువ లేకుండాపోతోంది. ఒకసారి ప్రజల ఓటుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఐదేళ్ల పాటు అంతా వారిష్టం అనుకుంటున్నారు.. ఎంతలా అంటే చివరికి తమకు ఇష్టం వచ్చిన స్థానాల్లో ఎమ్మెల్యేలుగా చెలామణి అయ్యేటంతగా.. ఇంకా పదవీకాలం ముగియకుండానే తమ స్థానాలను అధిష్టా నం ఇన్‌చార్జిలుగా నియమించిన వారిని ఇక మీరే చూసు కోండి అని అప్పగించేయడం కొసమెరుపు.అది చూసి ఓటు వేసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మా ఎమ్మెల్యే ఎవరబ్బా అని అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వింత పరిస్థితి చోటుచేసుకుంది.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలిచిన వ్యక్తే ప్రజాప్రతినిధి అవుతారు. ప్రజలు ఓటేసి గెలిపించిన వ్యక్తికి ఐదేళ్ల పాటు అధికార హక్కులు, బాధ్యతలు ఉంటాయి. కానీ ఇటీవల కొత్తధోరణి ప్రబలింది. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు విలువలేకుండా పోయింది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలదే పెత్తనం. ప్రతిపక్షాల తరఫున గెలిచిన ఎమ్మెల్యేలకు విలువ ఉండడం లేదు. ప్రస్తుతం ఈ పరిస్థితి మరింత దిగజారింది. వైసీపీ అధిష్ఠానం వచ్చే ఎన్నికల కోసం ఎమ్మెల్యేలను బదిలీ చేసింది.. ఇన్‌చార్జిలుగా నియమించింది. ఎవరైతే వచ్చే ఎన్నికల కోసం ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారో వారే ఎమ్మెల్యేలుగా మారిపోతున్నారు.

అసలు ఎమ్మెల్యే ఎవరబ్బా..

జిల్లాలో ఏడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం ఉండగా, టీడీపీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్ స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే.మిగతా స్థానాలను గత ఎన్నికల్లో వైసీపీ కైవసం చేసుకుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం వల్ల టీడీపీ ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వలేదు. అసలు పట్టించుకోలేదు. సిటీలోనూ, రూరల్‌లోనూ కోఆర్డినేటర్లను పెట్టి, వారి మాటే అధికారులు వినేటట్టు చేశారు. దీంతో ప్రజల నుంచి ఎన్నికకాని వ్యక్తులు అధికారం చలాయించే పరిస్థితి ఏర్పడింది. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ ఎంపీగా జిల్లా మొత్తం అభివృద్ధి చేయాలి. కానీ తన లోక్‌సభ స్థానాన్ని వదిలేసి రాజమహేంద్రవరం సిటీ మీద పట్టుకు ప్రయత్నం చేశారు.అధికారులు ఆయనకే విలువిచ్చారు. సిటీలో టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఉన్నా ఆమెకు కనీసం విలువ ఇవ్వకుండా ప్రభుత్వం, అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. గతంలో కొంతమంది కోఆర్డినేటర్లు ప్రజాప్రతినిధులు కాకపోయినా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం, అధికార ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడంతో ప్రజల ఓట్లతో నెగ్గిన వారికి విలువలేకుండా పోతోంది. పైగా ఇవాళ సిటీలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు కోఆర్డినేటర్లు చెప్పుకుంటున్నారు. ఈ డబ్బు ఎక్కడిది. వైసీపీ ప్రభుత్వం నుంచి ఎంత వచ్చిందంటే సమాధానం లేదు. మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు పన్నులు కట్టడం ద్వారా వచ్చిన జనరల్ ఫండ్‌తో అధికారులు చేయించిన పనులను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి జనరల్ నిధులు, ఫైనాన్స్ నిధులతో చేసిన పనులన్నీ ఇక్కడ ప్రజలతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేయించినట్టే లెక్క. కానీ ఇక్కడ లక్షల మంది ఓటర్లు ఓటు వేసి గెలిచిపించిన నేతలకు విలువ లేకుండా చేస్తున్నారు. రూరల్‌లోనూ అదే పరిస్థితి. టీడీపీ ఎమ్మెల్యేగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయనను కాదని వైసీపీ ముగ్గురు కోఆర్డినేటర్లను మార్చి వారికి పెత్తనం ఇచ్చి ఎమ్మెల్యే ప్రమేయం ఏమీ లేదన్నట్టు వ్యవహరించింది. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణును అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం ఓటర్లు నెగ్గిస్తే ఎమ్మెల్యే అయ్యారు. కానీ వైసీపీ అధినేత జగన్ ఆయనను వచ్చే ఎన్నికల్లో పోటీ నిమిత్తం రాజమహేంద్రవరం రూర ల్ కోఆర్డినేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి వేణు తనను ఓటేసి గెలిపించిన ప్రజలను అక్కడే వదిలేసి రాజమహేంద్రవరం రూరల్‌లో పెత్తనం చేస్తున్నారు. రూరల్‌లో ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విలువ లేకుండా చేస్తున్నారు. ప్రోటో కాల్ పాటించడంలేదు. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి.ఇదే పరిస్థితి కొవ్వూరు, గోపాలపురంలలో కూడా నెలకొంది. కొవ్వూరు నుంచి ఎన్నికై మంత్రిగా ఉన్న రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను గోపాలపురం కోఆర్డినేటర్‌గా నియమించి,అక్కడ ఎమ్మెల్యేను కొవ్వూరు కోఆర్డినేటర్ నియమించిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి వనిత తనను గెలిపించిన కొవ్వూరు ప్రజలను వదిలేసి గోపాలపురం వెళ్లిపోయారు. అక్కడ ప్రజలు గెలిపించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అక్కడి ప్రజలను వదిలేసి కొవ్వూరు వచ్చారు. ఆమె అక్కడ, ఆయన ఇక్కడ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. అసలు చట్టరీత్యా ఇది చెల్లుతుందా ఇక్కడ వీరు ప్రజాప్రతిని ధులు ఎలా అవుతారు.

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం.. అపహాస్యం



గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత



కొవ్వూరులో శనివారం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి

అంతా ఇష్టారాజ్యం..

అధికారం ఉంది కదా అనీ వైసీపీ అధిష్ఠానం చెప్పినట్టు అధికారులు నడచుకోవడం ప్రజా స్వామ్యమేనా? ఇక ఓటేసి గెలిపించిన ప్రజాప్రతినిధులకు విలువేముంది.వారు గెలిపించిన ప్రజాప్రతినిధికి విలువేముంది. కోఆర్డినేటర్ల వ్యవస్థతో ఎన్నికైన వారిని హక్కులను హరించడం నేరమవుతుంది. ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటే, ఓటరు ఎవరికి ఓటు వేయాలో కూడా నిర్ణయించుకోలేని పరిస్థితి వస్తుంది. ఎన్నడూ లేనిది నియోజకవర్గ ఇన్‌చార్జిలే ఎమ్మెల్యేలుగా చలామణి అయిపోతున్నారు. తమ ఇష్టం వచ్చినట్టు స్థానాలే మార్చేసుకుంటున్నారు. మరో దారుణమైన సంగతేంటంటే జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును ఎన్నికలషెడ్యూల్ కూడా ప్రకటించకుండానే పక్కన పెట్టేశారు. తోట నరసింహంను కోఆర్డినేటర్‌గా నియమించడంతో అధికారులంతా ఆయన మాటే వింటున్నారు.ఎమ్మెల్యే డమ్మీ అయ్యారు.గోకవరం మండలంలో ఆయన తిరగడం మానేశారు. ఆయన మాట వినేవారు లేరు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో, ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైనట్టయ్యింది.

స్పందనలో 167 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ , ఫిబ్రవరి 19: ప్రజల నుంచి వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత, జిల్లా ఎస్పీ పి.జగదీశ్ జిల్లా అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖతో కలిపి మొత్తం 167 అర్జీలు వచ్చాయని చెప్పారు. రెవెన్యూ శాఖకు 60, పోలీస్ శాఖకు 32, పంచాయతీ రాజ్‌కు 20, పురపాలక శాఖకు 15 అర్జీలు వచ్చాయన్నారు. సహాయ కలెక్టర్లు సి.యశ్వంత్ కుమార్, అదనపు ఎస్పీ అనీల్, డీఆర్‌వో జి నరసింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి, కెఆర్ ఆర్సీ ఎస్డీటీ కృష్ణనాయక్ లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఎన్నికలకు 16 బృందాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు 16 బృందాలను నియమించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల్లో విధుల్లో సుమారు 11 వేల మంది అధికారులు,సిబ్బంది పాల్గొంటారన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు అధికారులకు, సిబ్బందికి ఎటువంటి సెలవులకు అనుమతివ్వడం జరగదని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి ఇప్పటికే అధికారులు వారికి సంబంధించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 : ఓపీఎస్‌ను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు సోమవారం జనసేన, టీడీపీ నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యాచరణలో భాగంగా జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలిసి విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అన్ని రాజకీయపార్టీలు పాత పెన్షన్ విధానం అమలు చేసేలా తమ మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. పార్టీ అధినేతల దృష్టికి ఓపీఎస్ అంశం తీసుకెళతామని దుర్గేష్, బుచ్చయ్యచౌదరి తమతో చెప్పారన్నారు.

గప్‌చుప్!



- యథేచ్ఛగా సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్
- ఒక్కసారిగా ఆగిన తవ్వకాలు
- నేడు తనిఖీలకు ఎన్‌జీటీ రాక కారణం
- డ్రెడ్జింగ్ నిలిపివేయాలని ఆదేశం..
- సోమవారం రాత్రే గోదారంతా ఖాళీ
- అంతా సవ్యమేనని హైకోర్టుకు ఎస్పీ నివేదిక
- ఇసుక అక్రమార్కుల మాయాజాలం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో ఇసుక అక్రమార్కుల మాయాజాలానికి అంతులేకుండా పోయింది. జిల్లాలో సుమారు 25 ఓపెన్ ర్యాంపులు, సుమారు 40కు పైగా బోట్స్‌మన్ ర్యాంపుల ద్వారా గోదావరిలో రాత్రీపగలూ వందలాది డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తవ్వేస్తున్న సంగతి తెలిసిందే.ఈ డ్రెడ్జింగ్ దృశ్యాలు రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంత ప్రజలతో పాటు గోదావరి బ్రిడ్జిలపై రాకపోకలు సాగించేవారందరికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. కానీ అధికారులకు మాత్రం కనిపించడంలేదు. ఇసుక అక్రమాలపై నివేదిక ఇవ్వాలని సంక్రాంతి ముందు హైకోర్టు జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే.అయితే ఆయన కొద్దిరోజుల కిందట హైకోర్టుకు సమర్పించిన నివేదికలో అక్కడ అంతా సవ్యంగానే జరుగుతుంది, అక్రమంగా డ్రెడ్జింగ్ ఏమీ జరగడంలేదని, పలువురి బోట్స్‌మన్ సొసైటీలు, అధికారుల అభిప్రాయాలతో పాటు ,చివరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి కూడా ప్రస్తుతం ఏమీ జరగనున్నట్టు తెలిపినట్టు నివేదిక ఇవ్వడం గమనార్హం. కానీ ఇవాళ కూడా డ్రెడ్జింగ్ ఆగలేదు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలను స్వయంగా చూడడానికి ఎన్‌జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ప్రతినిధులు మంగళవారం రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై సోమవారం రాత్రి నుంచే డ్రెడ్జింగ్ నిలిపివేయాలని ఆదేశించారు. మంగళవారం ఎక్కడా డ్రెడ్జింగ్ బోట్లుకానీ,యంత్రాలు కానీ కనిపించకూడదని ర్యాంపు నిర్వాహకులకు సూచించారు.దీంతో మంగళవారం నాటికి గోదావరిలో డ్రెడ్జింగ్ బోట్లు,ఇతర యంత్రాలు కనిపించ కుండా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ పరిస్థితిని బట్టే ఇక్కడ ఇసుక అక్రమాలు జరుగుతున్నాయో లేదో అర్థంచేసుకోవచ్చు. గత మే నెలలో జేపీ సంస్థ కాంట్రాక్టు ముగిసిన సంగతి తెలిసిందే. కానీ రెండు నెలల కిందట వరకూ అదే సంస్థ పేరుతో రూ.కోట్ల విలువైన ఇసుక లాగేశారు. రాజమహేంద్రవరం వైపు ఆర్‌కే అనే ఒక వ్యక్తి నెలకు పెద్దలకు రూ.12 కోట్లు ఇచ్చే విధంగా ఒప్పందం పెట్టుకుని ర్యాంపు నిర్వాహకులకు టన్నుకు రూ. 150 నుంచి రూ. 200 ఇస్తూ డ్రెడ్జింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే.దీనిపై ఆరోపణలు రావడంతో పాటు ఒకరు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం కంగారు పడింది.

ఫక్కా ప్లాన్ ప్రకారం..

హైకోర్టు ఇక్కడి అక్రమాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీని ఆదేశించడంతో ఇసుక వ్యాపారులు తప్పించుకోవడానికి ఫక్కా ప్లాన్ వేశారు. దానికి గతంలో ఇసుక మేటలు డ్రెడ్జింగ్ కోసం సుమారు రూ.270 కోట్లతో ఒప్పందం పెట్టుకున్న రాఘవా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని రక్షణకవచంగా ఉపయోగించునే ఎత్తుగడ వేసినట్టు సమాచారం. వాస్తవానికి రెండేళ్ల కిందటే ఈ సంస్థ డ్రెడ్జింగ్ కాంట్రాక్టును దక్కించుకుంది. అయితే సదరు కాంట్రాక్టు సంస్థ సుమారు రెండు నెలల కిందట వరకూ డ్రెడ్జింగ్ మొదలు పెట్టలేదు. కానీ ఇతరులు అనధికారిగా డ్రెడ్జింగ్ నిర్వహించారు.ఇవాళ హైకోర్టు ఆదేశంతో ఇక్కడ డ్రెడ్జింగ్ అనధికారికంగా ఏమీ జరగలేదని చెప్పడానికి గతంలో కాంట్రాక్టు పొందిన సంస్థకు వెంటనే రంగంలోకి దింపినట్టు సమాచారం. ప్రస్తుతం డ్రెడ్జింగ్ అంతా అదే సంస్థ అధికారికంగా చేస్తుందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితి చూస్తే వేరేగా ఉంది.

డ్రెడ్జింగ్ అంటే ఇదా?

గోదావరిలో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించి, నీటి నిల్వను పెంచేటట్టు చేయాలి. పెద్ద డ్రెడ్జర్‌ను తెచ్చి నదిలో దింపి డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గొట్టాల ద్వారా గోదావరి ఒడ్డున ఇరిగేషన్ స్థలాల్లో పోగు చేయాలి. దానిని అధికారుల అనుమతితో మార్కెట్‌లో విక్రయించి ఆ సొమ్ము ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. గతంలో తెలుగుదేశం హయాంలో పిచ్చుకలంక పూడ్చడానికి మేటల డ్రెడ్జింగ్ ఇసు క ఉపయోగించారు. మేటల నుంచి పిచ్చులంకలోకి గొట్టాలు వేసి నేరుగా ఇసుకను పంపించారు. కానీ భారీ డ్రెడ్జర్లు లేవు. పెద్ద బోట్లకే లారీ ఇంజన్లు బిగించి డ్రెడ్జింగ్ చేస్తున్నారు. కేవలం రూ. 500 ఖర్చుతో సుమారు 40 నుంచి క్యూబిక్ మీటర్ల ఇసుకను ఒక సారిగానే తోడేస్తున్నారు. దీంతో ఖర్చు తక్కువ. లాభం ఎక్కువ.అందుకే అక్రమార్కులు ఈ మార్గం ఎంచుకున్నారు. పైగా ఇటీవల ప్రతిమా అనే సంస్థకు ఇసుక తీతను ప్రభుత్వం కాంట్రాక్టుకు ఇచ్చింది.ఆ సంస్థ లేబుల్‌తోనే బిల్లులు ఇస్తున్నారు. మరి ప్రస్తుతం ప్రతిమా సంస్థ డ్రెడ్జింగ్ చేస్తుందా? రాఘవా కంపెనీ చేస్తుందా అనేది ఇక్కడ ఎవరికీ అర్థం కాని విషయం.కానీ డ్రెడ్జింగ్ మాత్రం జరిగిపోతుంది.

అంతా సవ్యంగానే ఉందని ఎస్పీ నివేదిక

ఇసుక అక్రమాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో ఎస్పీ పి.జగదీష్ ఇటీవల హైకోర్టుకు నివేదిక ఇచ్చారు. కానీ అందులో ఎక్కడా యంత్రాలతో పనిచేయడంలేదని, మాన్యువల్‌గా చేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీ మాత్రమే ఒప్పందం ప్రకారం డ్రెడ్జింగ్ చేస్తున్నట్టు అధికారుల వివరణతో ఆయన నివేదిక ఇవ్వడం గమనార్హం. పైగా హైకోర్టుకు ఫిర్యాదు చేసిన వ్యక్తి కూడా ఇక్కడ అక్రమంగా డ్రెడ్జింగ్ జరగలేదని చెప్పినట్టు ఈ నివేదికలో ఉండడం గమనార్హం.వాస్తవానికి కచ్చులూరు బోట్ ప్రమాదం తర్వాత ఇక్కడ ఇసుక బోట్లకు లైసెన్సులు ఇవ్వలేదు.కానీ ఇక్కడ సాధారణ బోట్లతో పాటు డ్రెడ్జింగ్ బోట్లు కూడా తిరుగుతున్నాయి. వీటికి ఎవరు అనుమతిచ్చారు. ఇప్పటి వరకూ ఎంత ఇసుక తవ్వారు.గతంలో అక్రమాలు జరిగి ఉంటే ఎంత మేర జరిగి ఉంటాయనే దాని జోలికి ఎవరూ వెళ్లలేదు.

మరి భయమెందుకు

ఇక్కడ అక్రమాలు లేకపోతే, ఎన్జీటీ బృందం వస్తుందని తెలియగానే తేలుకుట్టిన దొంగలా వ్యవహరించడం దేనికి? మంగళవారం డ్రెడ్జింగ్ మిషన్లు,యంత్రాలను దాచేయమని ర్యాంపుల నిర్వాహకులకు ఆదేశాలివ్వడంలేదనికి..?దీనిని బట్టే ఇక్కడ ఎంత అక్రమాలు జరుగుతున్నాయో అర్థమ వుతోంది.

ఇన్‌స్టాగ్రామ్ వివాదం..
వివాహిత కిడ్నాప్

- కారులో ఎత్తుకెళ్లిన మహిళలు
- అరగంటలోనే పట్టుకున్న పోలీసులు

గోకవరం, ఫిబ్రవరి 19 : ఇన్‌స్టాగ్రామ్‌లో ఏర్పడిన వివాదం కారణంగా ఒక వివాహితను ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి పోలీసులకు చిక్కారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని చిట్టీలవారివీధికి చెందిన వీరమళ్ళ సునీతను కొవ్వూరుకు చెందిన ఇద్దరు మహిళలు, గోకవరానికి చెందిన మరో మహిళ కిడ్నాప్ చేసేందుకు సోమవారం మధ్యాహ్నం పన్నాగం పన్నారు. పథకం ప్రకారం ఐ ట్వంటీ కారులో సునీత ఇంటి వద్ద ముందుగా గస్తీ నిర్వహించారు.ఆ సమయంలో సునీత ఇంటి వద్ద లేకపోవడంతో ఆమె ఇంటికి వచ్చే వరకు అక్కడే కారులో కాపుకాచారు.ఇదిలా ఉండగా సునీత సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయట నుంచి ఇంటికి రావడాన్ని సదరు ముగ్గురు మహిళలు గుర్తించారు. వెంటనే కారు నుంచి ఆ ముగ్గురు మహిళలు సునీత ఇంటికెళ్లి ఆమెను బలవంతంగా ఈడ్చుకుంటూ కారులోకి ఎక్కించి అక్కడ నుంచి పరారయ్యారు.అడ్డొచ్చిన కుటుంబీకులను పక్కకు గెం టేశారు.దీంతో బాధిత కుటుంబీకులు షాక్‌కు గురయ్యారు. కొంత సేపటికి తేరుకున్న సునీత భర్త దేవీ వరప్రసాద్ హుటాహుటిన వెళ్లి ఎస్‌ఐ నాగరాజుకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేశారు. వివాహిత సునీతను కిడ్నాప్ చేసి తీసుకెళుతున్న నిందితుల కారు కోసం రెండు రూట్లలో అన్వేషణ ఆరంభించారు. చివరకు గోకవరం నుంచి తంటికొండ వెళ్లే రోడ్డులో కారును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌కు యత్నించిన ముగ్గురు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కారును స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్‌కు గురైన సునీతను బంధువులకు అప్పగించారు. బాధితులు మధ్యాహ్నం 3 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేయగా 3.30 గంటలకే కేసును చేధించారు. దీంతో బాధిత కుటుంబీకులు ఊపిరిపీల్చుకున్నారు.

పంట బోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్

క్లీనర్ మృతి

8

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు



కొవ్వూరు, ఫిబ్రవరి 19: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యధిక కేసులు రాజీ అయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలన్నారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకు బకాయి, మనోవర్తి, గృహహింస, వాహన ప్రమాద కేసులు, ప్రీలిటికేషన్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. దీని వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు బొబ్బా భారతి, ఎన్వీ సుబ్బారావు, తాడేపల్లి ప్రభాకర్, సుబ్బారావు, వి రాజావరప్రసాద్, హరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన రవీంద్ర



కొవ్వూరు, ఫిబ్రవరి 19: రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయిన వైవీ సుబ్బారెడ్డిని కొవ్వూరు సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు ఉన్నారు.

ఉసులుమర్రులో అభివృద్ధి పనులకు శ్రీకారం

పెరవలి, ఫిబ్రవరి 19: మండలంలో ఉసులుమర్రులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్ర, సచివాలయ భవనాలను ప్రారంభించారు. వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

కోటసత్తెమ్మ దేవాలయ అసిస్టెంట్ కమిషనర్‌గా

సూర్యప్రకాష్ బాధ్యతల స్వీకారం

నిడదవోలు, ఫిబ్రవరి 19: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానానికి సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా వి.హరి సూర్యప్రకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సూపరిండెంట్ జెల్లా సోమరాజు, ఆలయార్చకులు ట్రస్టుబోర్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

నిడదవోలు, ఫిబ్రవరి 19: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం నాక్ బృందం సందర్శించింది. వినోద్‌కుమార్ గార్గ్ చైర్మన్‌గా వచ్చిన నాక్ బృందం కళాశాలలోని ప్రతి విభాగానికి వెళ్లి రికార్డులను పరిశీలించడంతోపాటు కళాశాల చరిత్రపై పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సమావేశం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు.

రాగోలపల్లిలో గోపాలకృష్ణ గోఖలే వర్ధంతి

తాళ్లపూడి, ఫిబ్రవరి 19: స్వాతంత్ర సమర యోధుడు గోపాలకృష్ణ గోఖలే వర్ధంతి మండలం రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు డీడీ రావు మాట్లాడుతూ గోఖలే భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఎన్నో వ్యాసాలు రచించారని, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారని, దక్షణాఫ్రికాలో గాంధీజీతో కలిసి అక్కడి భారతీయుల సమస్యల పోరాటానికి కృషి చేశారన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

గోపాలపురం, ఫిబ్రవరి 19: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న దొండపూడికి చెందిన గున్నారి అజీత్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రస్తుతం అజీత్ ఆక్సీజన్‌పై ఉండడంతో ఖర్చుల నిమిత్తం సాయం చేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేష్, పిల్లి వెంకటేశ్వరరావు, వెల్లంకి జయశివసూర్యం, కొమ్మన ప్రసాద్, మల్లిపూడి శ్రీనివాస్, మద్దు రమాకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఖచ్చితంగా పాటించాలి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ వి.అప్పలరాజు చెప్పారు. సోమవారం మండలంలోని పాలంగి గ్రామంలో ఎన్నికల నియమావళిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగరాదని, ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి నగదును పెద్ద మొత్తంలో ఇతర ప్రాంతాలకు తరలించే సమయంలో వాటికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా తనిఖీ సమయంలో చూపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఏఎస్ఐ కె.రామకృష్ణ, నాయకులు పాలాటి శరత్‌బాబు, బొక్కా శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్‌జాని పాల్గొన్నారు.

మహిళల ఆర్థికస్వావలంబనకు 'బహుజన' కృషి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19: మహిళలు ఆర్థికస్వావలంబనకు తమ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్టు బహుజన ఫౌండేషన్ ఛైర్మన్ వైవీ రావు చెప్పారు. సోమవారం మండలంలోని మోర్త గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్ ఫోన్ రిపేరింగ్, టైలరింగ్, కంప్యూటర్ విద్య, విద్య, ఆర్థిక రంగాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ చిత్రసేన్, ఫౌండేషన్ లీగల్ ఎడ్వయిజర్ ఎం.శ్యామ్‌సన్, సీఐటీయూ మండల కన్వీనర్ ఏవీ సుబ్బారావు, సామాజికవేత్త చిర్రా గోపాల్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో సత్య వ్రతాలు

దేవరపల్లి, ఫిబ్రవరి 19: దేవరపల్లి షిరిడిసాయినాథ ఆలయంలో సోమవారం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సాయినాథ హోమం, సత్యవ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన గంటసాల ఫణికుమార్ వేదపండితుల ఆధ్వర్యంలో సాయిహోమం, సత్యవ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

చిన్నారి సహా ఇద్దరికి తీవ్రగాయాలు

గోపాలపురం, ఫిబ్రవరి 19: ఆగి ఉన్న లారీని ఢీకొని చిన్నారి సహా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన గోపాలపురం గ్రామ శివారులో సోమవారం జరిగింది. చిన్నారి సాత్వికతో కలిసి బుట్టాయగూడెం నుంచి చిట్యాల ద్విచక్రవాహనంపై వెళ్తున్న తూతిక నరసింహమూర్తి గోపాలపురం శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా నరసింహమూర్తి చికిత్స పొందుతున్నాడు. సాత్వికను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 19: కొవ్వూరులోని ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గోదావరి నదిలో గుర్తించిన మృతదేహం ఆచూకీ తెలిసిందని సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు ఒంటిపై షర్ట్ కాలర్‌పై ఉన్న టైలర్ స్టిక్కర్ ఆధారంగా మృతుడి చిరునామాను ఛేదించామన్నారు. మృతుడు జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రత్తిపాటి శ్రీరామ సందీప్ (38)గా గుర్తించామన్నారు. నల్లజర్లకు చెందిన సందీప్ కొంతకాలంగా జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు కొంతకాలంగా వేరువేరుగా ఉంటున్నారు. దీంతో మనస్తాపం చెంది గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడ, లేక ప్రమాదవశాత్తూ నదిలో జారిపడి మృతి చెందాడ అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య లేపాక్షిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ చంద్రాల బాబూరావు తెలిపారు.

గోదావరి నదిలో దూకి వ్యక్తి గల్లంతు!

కొవ్వూరు, ఫిబ్రవరి 19: కొవ్వూరు రోడ్ కం రైలు వంతెనపై నుంచి ఒక వ్యక్తి గోదావరి నదిలో దూకి గల్లంతయినట్టు సమాచారం. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. రోడ్డు కం రైలు బ్రిడ్జి 133వ స్తంభం వద్ద సోమవారం ద్విచక్ర వాహనం, పాదరక్షలు కనిపించాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎవరైన వాహనాన్ని అక్కడ పెట్టారా? లేదా గోదావరి నదిలో దూకారా అని వివరాలు సేకరిస్తున్నారు. నెంబరు ప్లేట్ ఆధారంగా వాహనం కొవ్వూరుకు చెందిన నార్కెడిమిల్లి ప్రవీణ్‌దిగా గుర్తించి, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. అయితే ప్రవీణ్ సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని సమాచారం.

విద్యాభ్యాసంపై ఆసక్తి ఉండాలి

గోపాలపురం, ఫిబ్రవరి 19: క్రమశిక్షణతో పాటు విద్యాభ్యాసం పట్ల ఆసక్తి కలిగినప్పుడే విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. వసతిగృహంలో అందిస్తున్న మౌలిక సౌకర్యాలతో పాటు, విద్య, వైద్యం, తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్‌పై దాడి

పిరికిపంద చర్య

- ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జరల్నిస్టుల నిరసన
- ఫొటోజర్నలిస్ట్‌పై దాడికి ఖండన
- తహశీల్దార్లకు వినతిపత్రాల అందజేత



గోపాలపురంలో డీటీ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

గోపాలపురం, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన బహిరంగ సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడి దాడికి పాల్పడడాన్ని గోపాలపురం నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడడం వైసీపీ మూకల పిరికి పంద చర్య అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయం నుంచి బైక్‌ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ కృష్ణకు అందించారు. ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు మాట్లాడుతూ రాజకీయ నాయకుల బహిరంగ సభల్లో ఫొటోలు తీయడం ఫొటోగ్రాఫర్‌గా జర్నలిస్టు వృత్తి ధర్మమని, దానిని జర్నలిస్టు వృత్తిగానే చూడాలి కానీ రాజకీయకోణంలో చూడడం సరికాదన్నారు. ఇటీవల దెందులూరు సిద్ధం సభలో జర్నలిస్టులపై ముకుమ్మడి దాడికి పాల్పడ్డారన్నారు. దాడులను జర్నలిస్టు యూనియన్ సహించదని, జర్నలిస్టులపై దాడులను ప్రోత్సహించడం రాజకీయ పార్టీలకు సరికాదన్నారు. ఇదే ధోరణి కొనసాగితే ప్రజాసమస్యలు ఎత్తిచూపే జర్నలిస్టులు భవిష్యత్తులో కరువవుతారని అన్నారు. జర్నలిస్టు కృష్ణపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నాగార్జున, దాసరి రామారావు, గాబ్రియేలు, రాగూర్, మహేష్, ప్రసాద్, ప్రసన్న, నాని, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకుల దాడి హేయమని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. రాప్తాడులో శ్రీకృష్ణపై దాడిని వారు ఖండించారు. వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు, దళితులు, మహిళలు అని తేడా లేకుండా దాడులకు పాల్పడుతోందన్నారు. రాప్తాడులో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, రాష్ట్రంలో ప్రతికాస్వేచ్ఛను కాపాడాలన్నారు.



నిడదవోలులో తహశీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెరవలి: రాప్తాడులోని వైసీపీ సభలో ఆంధ్రజ్యోతి ఫొటో విలేకరిపై కొందరు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరచడాన్ని పెరవలి విలేకరులు ఖండించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచే శారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసే పత్రికా విలేకరులపై దాడులు చేయడం అన్యాయమని నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు ఎం.శ్రీనివాస్, భాస్కరరావు, కర్రి శ్రీనివాసు, వేణుగోపాల కృష్ణ, రత్నరాజు, శ్రీనివాసు, జీవన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ మాట్లాడుతూ రాప్తాడులో వైసీపీ నాయకులను ఫొటోలు కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకృష్ణపై ఆ పార్టీ గూండాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, తమ అవినీతి అక్రమాలు కప్పిపుచ్చుకోవడానికి పత్రికా వ్యవస్థపై దాడి చేయడం అవివేకమని అటువంటి వాటిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పెరవలిలో తహశీల్దార్ సుధకు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిడదవోలు జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సదర్భంగా నిడదవోలు జర్నలిస్ట్ సంఘాల అధ్యక్షులు పట్టపగలు ప్రసాద్, బి.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్ళిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై పోలీసులు, ప్రజల సమక్షంలోనే వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల వారు దాడులకు గురవుతున్నారన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్ట్‌లపై దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్ మాట్లాడుతూ వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం తహశీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, కె.దుర్గారావు, గంగాదర్, సనమండ్ర రాజ్‌కుమార్, రాము, జావిద్, రెడ్డి, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

తాళ్లపూడి: విలేకరులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ప్రమోద్ అన్నారు. అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని దాడిలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని విలేకరులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు విలేకరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలపై దాడులు'

దేవరపల్లి, ఫిబ్రవరి 19: వైసీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, రాప్తాడులో జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలుదాడులు చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మీడియాను జగన్ కక్షతో కూలగొట్టాలని చూస్తున్నాడన్నారు. జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషమని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు.

నల్లజర్ల: నల్లజర్లలో తహశీల్దార్ కిషోర్‌కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే నాయకుడు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే మండలాధ్యక్షుడు చెల్లు మోజేష్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మీడియాపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. దాడికి పాల్పడిన రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి దాడుల జరగకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే కార్యదర్శి రాపోలు వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు యజ్జవరపు గాంధీ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో తహశీల్దార్ కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే

ఛత్రపతి శివాజీ జయంతి

కొవ్వూరు, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఛత్రపతి శివాజీ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరులోని 1వ వార్డు శ్రీరామకాలనీలో శివాజీ జయంతి నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ శివాజీ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగేంద్ర మాట్లాడుతూ విశ్వ గురువుగా ఉన్న భారత్‌ను అస్థిర పరచాలనే ఉద్దేశ్యంతో అనేకసార్లు దేశంపైకి దండెత్తిన శత్రుమూకలపై గొరిల్లా యుద్ధ విధానంలో నశింపజేసి భారతీయ సామ్రాజ్యాన్ని స్థాపించిన ధీరుడు శివాజీ అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌వీ రమణమూర్తి, కారుపాటి వివేకానంద, బెనుగు రమేష్, మడిచర్ల రామచంద్రరావు, చెరుకూరి సాయిరాజు, యనమదల సుబ్రహ్మణ్యం, బోడపాటి ముత్యాలరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి గాంధీబొమ్మ సెంటరులో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పశ్చిమ భారతాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప వీరుడని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో గోకవరపు జితేంద్ర రవి, చక్కా నాగుశ్వరరావు, చిరవూరి పోసి శ్రీనివాసు, కత్తిరి కుమార్, శిద్దంశెట్టి బాలాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.



తాళ్లపూడిలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గోపాలపురం: గోపాలపురంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్‌మార్‌డప్పులు, బాణసంచా కాలుస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి శివనాగరాజు, షైలు శ్రీనివాసరావు, తాండ్ర సందీప్, బొడ్డు వీరరాఘవులు, బొట్టా శివరామకృష్ణ, వేములపల్లి నరేంద్ర, రామలీలాధర్ పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

- టీడీపీ గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

నల్లజర్ల, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం నల్లజర్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలు గమనించారని, రూ.10 ఇచ్చి రూ.100 దోచిన జగన్ రెడ్డి సంక్షేమం గురించి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. వందల కోట్లు ప్రజా ధానాన్ని ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతున్నారని విమర్శించారు. జగన్ పేరు చెపితే అధిక ధరలు, పన్నులు, చార్జీల పెంపు, అప్పులు, మోసాలు, దొంగ ఓట్లు, హింసా రాజకీయలు గుర్తుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, షేక్ మీరాసాహెబ్,యద్దనపూడి బ్రహ్మరాజు, యలమాటి శ్రీను, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం : ద్విసభ్య కమిటీ



కొవ్వూరు, ఫిబ్రవరి 19: సిద్ధం సభల పేరిట వందల కోట్లు ఖర్చు చేస్తూ జగన్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి విమర్శించారు. సోమవారం కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ సిద్ధం సభల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని సీఎం సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టి మద్యం, ఇసుక, సహజవరులను దోచుకుంటున్నారన్నారు. సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి పన్నుల రూపంలో రూ.100 లాగేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి 25 సీట్లు కూడా రావన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్‌రెడ్డిని ఇంటికి పంపుదామా అని ప్రజలు బటన్ నొక్కడానికి సిద్ధంగా ఉన్నారని ద్విసభ్య కమిటీ పేర్కొంది.

మార్చి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్

హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 19: మార్చి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం యర్నగూడెంలో ఆర్.కన్వేన్షన్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ప్రభుత్వం అన్ని వర్గాలకు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై అక్కడ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని అక్కడ నుంచే పోటీ చేద్దామనే బలమైన ఆలోచన ఉందని తాను ఒకటి తలిస్తే, దైవమొకటి తలచిందని, దైవ నిర్ణయంతోనే గోపాలపురం నియోజకవర్గంలో సీఎం జగన్ ఆదేశాల మేరకు పోటీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, నియోజకవర్గంలోని పాస్టర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 12 ఫిర్యాదులు

కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఏవో

కొవ్వూరు, ఫిబ్రవరి 19: డివిజనల్ స్పందనలో 12 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సం దర్భంగా ఎంపీడీవో 3, రెవెన్యూ 6, ఆర్టీసీ 1, వెటర్నరీ 1, పోలీస్ 1 దరఖాస్తును స్వీకరించామన్నారు. కొవ్వూరుకు చెందిన పెనుమాక జయరాజు కొవ్వూరు నుంచి వాడపల్లి మీదుగా నిడదవోలుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటుచేయాలని, విశాఖపట్నం, విజయవాడ వైపు వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు కొవ్వూరు బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో కె.రవివిక్రమ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాజేస్తున్నారు..

గోపాలపురం, ఫిబ్రవరి 19: ప్రభుత్వ భూములు కాజేస్తున్నారంటూ చిట్యాల సర్పంచ్ నూతంగి సరోజిని స్పందనలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గత శనివారం రాత్రి పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న సుమారు 4సెంట్ల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికార పార్టీనని చెప్పుకుంటూ చదును చేసినట్టు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అక్రమణదారుడికి అధికార పార్టీ అండదండలు ఉండడంతో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులు స్పందించడంలేదని ఆమె వాపోయారు.

నేడు ధవళేశ్వరం జనార్ధన స్వామి రథోత్సవం



ధవళేశ్వరం, ఫిబ్రవరి 19: పురాణ ప్రసిద్ధి గాంచి జనార్ధన గిరిపై ఉన్న లక్ష్మీజనార్ధన స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసరాలను చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు చేసి పుర వీధుల్లో ఊరేగిస్తారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ వినయ్ మోహన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించనున్నారు. రాత్రికి కొండపై స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ మేళా

బిక్కవోలు, ఫిబ్రవరి 19: బలభద్రపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్, సాప్, టీటీసీ సహకారంతో సోమవారం డిజిటల్ మేళాను ఏర్పాటు చేశారు. మేళాను సర్పంచ్, ఉపసర్పంచ్ బుంగా రామారావు, నల్లమిల్లి వెంకటరెడ్డి ప్రారంభించారు. మేళాలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీబీ వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్

ఒకరి మృతి.. ఇద్దరికి స్వల్పగాయాలు





క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ దాలియ (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో

దేవరపల్లి, ఫిబ్రవరి 19: జీవనోపాధి కోసం వచ్చి రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెంది కుటుంబానికి విషాదం మిగిల్చిన ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం జాతీయ రహదారి వద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సోమవారం భీమవరం నుంచి విశాఖపట్నం డెకరేషన్ సామగ్రితో వెళ్తున్న వ్యాన్ దేవరపల్లి మండలం కృష్ణంపాలెం సమీపంలో సర్వీసు రహదారిలో పంటబోదెలోకి దూసుకెళ్లి సిమెంటు దిమ్మను ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్‌లో ముగ్గురు ప్రయాణిస్తుండగా ఒరిస్సాకు చెందిన వ్యాన్ క్లీనర్ చైతన్ దాలియ(54) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా దాలియ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు ఇటీవల జీవనోపాధి నిమిత్తం కుమారుడితో కలిసి విశాఖపట్నం వచ్చాడని, ఈ నెల 17న భీమవరంలోని ఒక ఫంక్షన్‌కు డెకరేషన్ చేసి ఆదివారం తెల్లవారుజామును తిరిగి సామగ్రితో వెళ్తుండగా డ్రైవర్ నిద్రమత్తు వల్ల ప్రమాదం జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	: ఈగల్
వై.స్క్రీన్2	: రాజధాని ఫైల్స్
దేవిశ్రీ(గాయత్రి)	: హనుమాన్
అనన్య	: అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	: ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	: రాజధాని ఫైల్స్
శ్రీగణపతి	: ఈగల్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	: సలార్
శ్రీనివాస	: సలార్